## జీవిత సభ్యతం

**2012 ఏప్రిల్ – మే నెలలో పంపిన వారి వివరాలు**

| నెం. | | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|---|
| 1. | మే 2012 | కాచం సాంబయ్య, సిరిసిల్ల | రూ. 1000.00 |
| 2. | మే 2012 | ఇనగుండుల వెంకటేశం, సిరిసిల్ల | రూ. 1000.00 |
| 3. | మే 2012 | బచ్చు వెంకటేశ్వరావు, హైదరాబాద్ | రూ. 1000.00 |
| 4. | మే 2012 | తమ్మిశెట్టి అశోక్ కుమార్, కరీంనగర్ | రూ. 1000.00 |
| 5. | మే 2012 | పి. లింగయ్య, హైదరాబాద్ | రూ. 0500.00 |
| 6. | మే 2012 | డి. రామచందర్, నిజామాబాద్ | రూ. 1000.00 |
| | | **మొత్తము** | **రూ. 5500.00** |

# పత్రిక సభ్యత్వం

1. మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/– (వెయ్యి రూపాయలు). 2. రెండు దఫాలుగా కూడా రూ.500/– చొప్పున చెల్లించవచ్చు. 3. జీవిత సభ్యత్వం చెల్లింపులపై వచ్చే వడ్డీని మాత్రమే పత్రిక నిర్వహణా ఖర్చులకు వినియోగించాలి. అయితే నేటి వరకు జీవిత సభ్యత్వంపై వచ్చిన వడ్డీని కూడా అసలు మొత్తానికే జమచేయడమైనది. 4. వార్షిక సభ్యత్వం రూ.100/– పోస్టల్ మనీ ఆర్డర్ ద్వారా పంపవలిసింది. 5. బ్యాంకు డ్రాఫ్టు లేదా బ్యాంకు చెక్కు ద్వారా పంపగోరు వారు శ్రీమతి నిర్మలాదేవి, హైదరాబాద్ పేరున పంపగలరు.


## మా అడ్రస్:

**ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్, బాబాస్ హౌస్, యాప్రాల్, ప్లాట్ నెం.32,**

**జె.జె. నగర్ కాలనీ, సికింద్రాబాద్–500087. ఫోన్: 99595–53218**

**malladisukku@gmail.com, krishnanandm@yahoo.com,**



Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.

**Editor: D.Nirmaladevi**

RNI No. APTEL/2002/7310, Postal Concession: R&D/RNP/HSE/789/2012-2014, **Dt.19-12-2011**




# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక


సంపుటి : 12 సంచిక: 01 హైదరాబాద్ మే 2012 పేజీలు 40

**Please visit : www.srimeherbaba.com** **వార్షిక సభ్యత్వం : రూ.100/–**

# 86వ మౌన వార్షికోత్సవం

## జూలై 10, 2012

86వ మౌన వార్షికోత్సవానికై మెహెరాబాద్‌కు విచ్చేయుచున్న బాబా ప్రేమికులందరికీ ఆంధ్రా రెస్టుహౌసు స్వాగతం పలుకుతోందని కార్యదర్శి శ్రీ వై.ఎస్. రావు ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 300 మంది బాబా ప్రేమికులకు భోజన, వసతి సౌకర్యం కల్పించేందుకు తగిన ఏర్పాట్లు రెస్టుహౌసులో చేసినట్లు శ్రీ రావు తెలిపారు. ఐతే ఆంధ్రా రెస్టుహౌసులో బస ఏర్పాటులో జీవిత సభ్యులకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించినట్లు, అలాగే అనారోగ్యంతో బాధపడుతున్నవారికి, వృద్ధులకు తగిన ప్రాధాన్యతా క్రమంలో బస ఏర్పాటు చేయగలమని శ్రీ రావు తెలిపారు. గత అమరతిథిలో ఏర్పాటు చేసినట్లుగానే ఆంధ్రా రెస్టుహౌసు నుండి బాబా సమాధి వరకు ఉచిత రవాణా సౌకర్యం జూలై 9 నుండి 11వ తేదీ వరకు ఏర్పాటు చేసినట్లు శ్రీ రావు తెలిపారు.

### జీవిత సభ్యులు:

ఆంధ్రా రెస్టుహౌసులో జీవిత సభ్యులుగా మీ బంధు మిత్రులను చేర్పించవల్సిందిగా శ్రీ రావు విజ్ఞప్తి చేస్తున్నారు. మరిన్ని వివరాలకు: శ్రీ వై.ఎస్. రావు, ఆంధ్రా రెస్టుహౌస్, మెహెరాబాద్ - 414006, అహమ్మద్ నగర్, ఫోన్: 98481 11671, 090117 51910 ను సంప్రదించగలరు.

## మెహెరస్థాన్‌లో

మౌన వార్షికోత్సవం సందర్భంగా మెహెరస్థాన్‌కు విచ్చేయు బాబా ప్రేమికుల కోసం కూడా జూలై 9 నుండి 11 వరకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. బాబా ప్రేమికులు ఈ సదావకాశాన్ని వినియోగించుకోవల్సిందిగా ఆయన కోరుతున్నారు. మెహెరస్థాన్ ధర్మశాలలో భోజన, బస ఏర్పాట్లు కోరువారు నేరుగా శ్రీ వైయస్ రావ్‌ను సంప్రదించవల్సింది.

## వర్ని బాబా సెంటర్ 9వ వార్షికోత్సవం

నిజామాబాద్ జిల్లా వర్ని బాబా సెంటర్ 9 వ వార్షికోత్సవం సందర్భంగా 2012 జూన్ 10 ఉదయం 9 నుండి 2 గంటల వరకు బాబా సహవాస్ ఏర్పాటు చేసినట్లు, బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొన వల్సిందిగా శ్రీ జనార్ధనరావు, నిజామాబాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు: 9908785774 ను సంప్రదించగలరు.





## సందేశం

అతడెంత గుణవంతుడైనప్పటికీ, కామాన్ని జయించలేనివాడు (కాముకుడు) ఆధ్యాత్మిక పథంలో ముందుకు కొనసాగలేడు. అతగాడు ఒంటి చక్రం గల బండిలాంటివాడని గమనించాలన్నారు మెహెర్‌బాబా..

"A lustful man no matter what good qualities he may possess, cannot move along the spiritual path, he is like a cart with wheel. -Meher Baba.

**గౌరవ సంపాదకులు**
**మల్లాది కృష్ణానంద్**
**99595-53218,**
**krishnanandm@yahoo.com**
**malladisukku@gmail.com**

**వ్యవస్థాపకులు:**
**దశిక ప్రసాదరావు**
**040-65699611**

**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం.32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218

## లోపలి పేజీలలో...

| | | |
|---|---|---|
| 1. | సంపాదకీయం | 5 |
| 2. | మెహ్రూ ఇరానీ బాబాలో ఐక్యం | 6-7 |
| 3. | యం.ఫిల్ ప్రదానం | 8-9 |
| 4. | కృష్ణనాయర్ | 10-17 |
| 5. | వార్డ్ పార్క్స్ | 18-19 |
| 6. | లార్డ్ మెహెర్ | 20-35 |
| 7. | నూతన బాబా సెంటర్ | 37 |
| 8. | ప్రార్థనలు | 38-39 |

**ముఖ చిత్రం**

Meher Baba sat on these chairs during his visits to the Nalavala home in Dehra Dun in the forties

**మనవి**

**మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీలలో పోస్టు చేస్తున్నాం. 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.**

Please visit : www.srimeherbaba.com




# మెహెరస్థాన్ ధర్మశాల సప్తమ వార్షికోత్సవం

మెహెరస్థాన్ ధర్మశాల 7వ వార్షికోత్సవాన్ని 2012 జూలై 29 ఆఖరి ఆదివారం ఉ. 7.30 నుండి సాయంత్రం 6 దాకా నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి శ్రీ వై.యస్. రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మెహెరాబాద్ నుండి శ్రీ మెహెర్‌నాథ్ కల్చూరీ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరవుతున్నారు. కాగా ఉత్తరాదిన గల పలు బాబా సెంటర్ల ప్రేమికులు విశేష సంఖ్యలో పాల్గొంటున్నారని, స్థానిక తెలుగు బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొని బాబావారి ఆశీశ్సులు పొందవలెనని శ్రీ రావు కోరుతున్నారు.

# ఖమ్మం గోల్డెన్ జూబ్లీ

అవతార్ మెహెర్‌బాబా ఖమ్మం సెంటరు గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు, అంతర్జాతీయ ప్రేమిక సహవాస్ 10.08.2012 నుండి 12.08.2012 వరకు నిర్వహిస్తున్నట్లు శ్రీ ఆర్. రామచంద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాల్గొనగోరు సాంస్కృతిక, పాటలు పాడు బృందములు తమ ప్రతిపాదనలను కేరాఫ్ హౌస్.నెం. 10-1-17, మామిళ్ళ గూడెం, ఖమ్మం-507 001 (98486 07718) త్వరలో పంపించవలసినదిగా కోరుతున్నారు.

## మీ రచనలు పంపండి

మంచి రచనలు పంపండి. మీ రచనలు ఆంగ్లానువాదాలయితే ఆంగ్ల ప్రతిని కూడా దయచేసి జతపరచండి. ప్రచురణకు వీలుకాని రచనలు త్రిప్పిపంపడం కష్టమని గమనించగలరు.





సంపాదకీయం

# పుష్కర సంపుటి

మెహెర్‌బాబా పత్రిక ప్రారంభించి నేటికి 11 సంవత్సరాలు నిండాయి.

2001 మే 12న తొలి సంచిక వెలువడింది.

హైదరాబాద్‌లోని కోఠి సెంటర్‌లో శ్రీమతి నోరి ప్రభాకరమ్మ లాంఛనంగా క్రొత్త పత్రికను అవిష్కరించి తొలి ప్రతిని శ్రీ యం.వి.బి.ఆర్. శర్మకు అందజేశారు.

అవతారుని కృప వల్ల నాటి నుండీ క్రమం తప్పక సరైన సమయానికి ఠంచనుగా పోస్టలు బట్వాడా చేస్తున్నాం.

ప్రతి సంచికను ఎంతో ప్రేమతో దాచుకుంటున్న పాఠక మహాశయులందరికీ పేరు పేరునా మా హృదయపూర్వక జై మెహెర్‌బాబాలు.

పత్రిక ప్రారంభించిన తొలి మాసం నుండీ వార్షిక, జీవిత సభ్యుల సంఖ్య గణనీయంగా పెరుగుతూనే వుంది.

ఇదొక శుభ పరిణామం.

ఈ సందర్భంగా మెహెర్‌బాబా పత్రిక వ్యవస్థాపకులు శ్రీ దశిక ప్రసాదరావు గారిని మనసారా స్మరించుకుందాం.

**మంచి కానుక**

**పుష్కర సంపుటిలోకి అడుగిడుతున్న ఈ శుభతరుణంలో**

అవతార్ మెహెర్‌బాబాకి తన జీవితాన్ని సంపూర్ణంగా అంకితమిచ్చి,

బాబావారి ఆదేశాలు, సూచనల మేరకు తన జీవితాంతం నడుచుకున్న

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని హమీర్‌పూర్ జిల్లావాసి

శ్రీ కేశవ్ నారాయణ్ నిగం గారి జీవిత చరిత్రను తెలుగులో అనువదించి ప్రచురించడమైంది.

బాబావారి ఆదేశాల మేరకు ఇంగ్లీషులో కేశవ్‌జీ రాసుకున్న ఆయన ఆత్మకథను మెహెర్‌బాబా పత్రిక తరఫున

**సర్వధర్మాన్ పరిత్యజ్య...అనే మకుటంతో ప్రచురించింది.**

బాబా ప్రేమికులందరూ తప్పక చదవాల్సివ పుస్తకమిది.

ఈ పుస్తకం 2012 మే, 27న లాంఛనంగా విడుదల చేయాలని మా ప్రయత్నం.

మీ సహకారం ఆశిస్తూ.. ...,

# మెహ్రూ ఇరానీ బాబాలో ఐక్యం



మెహెర్ బాబా స్త్రీ మండలి సభ్యురాలు మెహ్రూ ఇరానీ 2012 ఏప్రిల్ 21న తుదిశ్వాస వదిలారు.

ఆమెకు 84 సంవత్సరాలు.

దీంతో మెహెర్‌బాబా ఆశ్రమంలో బాబాతో సాంగత్యం గడిపిన స్త్రీ మండలి సభ్యులందరూ బాబాలో ఐక్యమయి పోయినట్లే.

ఆ కోవలో మెహ్రూ చిట్టచివరి వ్యక్తి.

ఈమె తండ్రి రుస్తుం, తల్లి ఫ్రీనీ ఇరానీ. వీరిద్దరూ కూడా 1920వ దశకం నుండీ అవతారునిలో తమ ఇష్టదైవాన్ని దర్శించుకుని, తమ సర్వస్వం బాబా పాదాలచెంత వుంచి బాబాకు అనేక సేవలందించారు.

ఈమె తల్లి ఫ్రీనీ ఇరానీ మెహెర్‌బాబాను అమితంగా ప్రేమించే మెహెరాయాయికి స్వయానా చెల్లెలు.

2012 ఏప్రిల్ 22 ఉదయం 8.30 నిముషాలకు మెహ్రూ పార్థివ శరీరాన్ని బాబా సమాధి ప్రాంగణంలో వుంచి, ఆ తర్వాత దిగువ మెహెరాబాద్‌లోని మండలి హాలులో





బాబా ప్రేమికులు సందర్శనార్థం వుంచారు. ట్రస్టు చైర్మన్ భావూజీతో పాటు పలువురు బాబా ప్రేమికులు హాజరయ్యారు.

ఆమె మరణవార్త వినగానే హైదరాబాద్ నుంచి పలువురు బాబా ప్రేమికులు శ్రీ బి. రామకృష్ణయ్య, శ్రీ రాజేంద్ర మెహెర్, శ్రీ నోరి మెహెర్‌చంద్ తదితరులు మెహెరాబాద్‌కు హుటాహుటిన వెళ్ళారు. అమె అంత్యక్రియలు అయ్యేవరకూ వారక్కడే వున్నారు.

మెహ్రూ తన స్కూలు చదువు అయిపోగానే మెహెర్‌బాబా ఆశ్రమవాసిగా వచ్చి చేరింది. బాబా కూడా అతి పిన్న వయస్సులోనే ఆమెను తన మండలి సభ్యురాలిగా స్వీకరించారు.

మెహెరామాయికి సహాయకురాలిగా మెహ్రూను బాబా స్వయంగా నియమించారు.

ఆ మాదిరిగా చిన్ననాటి నుండీ మెహెరుడికి – మెహెరామాయికి తన సేవలందించి తరించిన ధన్యజీవి మెహ్రూ.

మెహెరామాయి బాబాలో ఐక్యమయ్యాక బాబా గదిని శుభ్రపరచడం, నిత్యం వచ్చేపోయే బాబా ప్రేమికులతో అవతారునితో తమ జ్ఞాపకాలు పంచుకోవడం, బాబావారు వాడిన వస్తువుల బధ్రత ఇతరత్రా మెహ్రూ చేపట్టింది.

మెహ్రూ చిన్నతనం నుండీ అంటే ఆమెకు నాలుగైదు సంవత్సరాల వయస్సు నుండీ పెద్దయ్యాక ఏం చేయ్యాలనుకుంటున్నావ్ అని బాబా ఎప్పుడు అడిగినా – స్త్రీ మండలి సభ్యులు మాదిరిగా నీకు సేవ చేయ్యాలన్నదే నా జీవిత లక్ష్యం అని మెహ్రూ చెప్పేది.

బాబాని ఎంతగా ప్రేమిస్తావ్? అని బాబా అడిగితే,

ఎంత అని అంటే తన రెండు చేతులూ చాపి,

**– ఇంత –** అని బాబాతో చెప్పేసరికి ఆనందపరవశుడైన ప్రేమావతారుడు ప్రేమతో ఆ చంటి పాపను అక్కున చేర్చుకున్నారని ఆనాటి మధుర జ్ఞాపకాలను ఆమె సమకాలీనులు చెప్తారు.

ఆమె తల్లి ఫ్రీనీ కూడా బాబా పట్ల తన కుమార్తెకు గల భక్తి ప్రపత్తులకు ముగ్ధురాలై, తన కుమార్తెను ఎంతగానో ప్రోత్సహించిందని మండలివారు అభిప్రాయపడతారు.

ఈ ప్రపంచంలో నీవు ఎవరిని బాగా ప్రేమిస్తావ్? అని బాబా అడిగితే,

క్షణకాలమైనా ఆలోచించకుండా

**'బాబా'** అని ఠపీమని జవాబిచ్చేది – మెహ్రూ.

మెహెర్‌బాబా నవజీవనంలో పాల్గొన్న నలుగురు స్త్రీ మండలి సభ్యుల్లో మెహ్రూ కూడా వున్నారు.

# మెహెర్‌బాబా ప్రవచనాలపై
# యం.ఫిల్ ప్రధానం



అవతార్ మెహెర్‌బాబా ప్రవచనాలు, భగవద్వచనం వంటి గ్రంధాలపై వలు విశ్వవిద్యాలయాలలో పి.హెచ్.డి., యం.ఫిల్ చేశారని మనలో చాలామందిమి విని వున్నాం. కానీ, ఇతమిద్దంగా ఎవరు చేశారన్న సమాచారం తగినంతగా లేదు.

ఐతే, ఇటీవల నాగార్జున విశ్వవిద్యాలయంలో **మెహెర్ చంద్ర రచనలు – అవతార్ మెహెర్‌బాబా ప్రవచనాలు** అనే అంశంపై యం.ఫిల్ చేసి ఫస్ట్ క్లాసు తెచ్చుకున్న విద్యార్ధిని శ్రీమతి గుత్తికొండ హరిప్రియ గురించి విశాఖపట్నం బాబా ప్రేమికులు శ్రీ మాలిన సత్యనారాయణ గారు మెహెర్‌బాబా ప్రతినిధికి తెలియజేశారు. ఆపై ఈ విషయమై శ్రీమతి హరిప్రియను సంప్రదించగా 2011 లో నాగార్జున విశ్వవిద్యాలయం తనకు యం.ఫిల్ పట్టా అందజేసిందని, తనకు ఫస్ట్ క్లాసు వచ్చిందని చెప్పారు.

మరిన్ని విషయాలు తెలియజేస్తూ, – నేను ఎం.ఏ (తెలుగు), టీచర్ ట్రైనింగ్ కోర్సు పూర్తిచేసి, స్థానిక కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తూ, తెలుగులో ఎం.ఫిల్ పట్టా కోసం నా పేరును విశ్వవిద్యాలయంలో నమోదు చేయించుకున్నాను. ఏదేనీ ఆధ్యాత్మిక విషయంపై పరిశోధన చేయాలన్నది నా లక్ష్యం. మా గైడ్ ప్రొ. గుమ్మా సాంబశివరావు గారు అవతార్ మెహెర్‌బాబా ప్రవచనాలను పరిశోధనాంశంగా ఎంచుకుంటే బాగుంటుందని సూచించారు. ఆ మేరకు మా గురువు గారితో కలిసి డాక్టర్ పూర్ణచంద్రరావు, విజయవాడ, కలిసాను. డాక్టర్ పూర్ణచంద్రరావు గారి తండ్రి శ్రీ చంద్రమౌళేశ్వర రావు, మెహెర్‌బాబా





ప్రేమికులు, అలాగే ఆయన అవతార్ మెహెర్ మాస పత్రికకు చాలా కాలం ఎడిటర్‌గా వున్నారని, మెహెర్‌బాబా గురించి అనేక పుస్తకాలు రాసారని మా గురువు గారు నన్ను ఆయనకు పరిచయం చేశారు. ఆ మాదిరిగా నా పరిశోధనాంశాన్ని ఎంపిక చేసుకున్నాను. అదేమాదిరిగా తొలిసారిగా మెహెర్‌బాబా పేరును కూడా మా గురువు గారి ద్వారానే విన్నాను.

డా. పూర్ణచంద్రరావు గారు బాబా సాహిత్యాన్ని, వాళ్ళ నాన్న గారు రాసిన చాలా పుస్తకాలు నాకిచ్చారు. అవన్నీ చదివి, ఏడాది తర్వాత నా పరిశోధనాంశాన్ని రాసి మా గురువు గారికి చూపించాను. ఆయన పెదవి విరిచారు. నిర్మొహమాటంగా తిరిగి రాయాలని సూచించారు. నేను రాసింది ఏమీ బాగోలేదన్నారు. ఈ మాదిరిగా థీసీస్ సమర్పిస్తే విశ్వవిద్యాలయంవారు అంగీకరించకపోవచ్చునీ హెచ్చరించారు.

ఆధ్యాత్మిక అంశం.

అందునా మెహెర్‌బాబా గురించి అంతక్రితం వరకూ ఏమీ తెలియకపోవడంతో కొంత ఇబ్బంది పడ్డాను. ల

గడువు లోగా థీసీస్ పూర్తికాదేమోనని బాధతో కళ్ళంబడి నీళ్ళొచ్చాయి. మెహెర్‌బాబానే ఈ సమస్యకు దారి చూపాలని దణ్ణం పెట్టుకున్నాను. అలా రోదిస్తూ నిద్రలోకి జారుకున్నాను.

నమ్మలేని నిజం ఏమంటే, ఆ రోజు రాత్రి బాబా కలలో కనబడ్డారు. నా చేతిని తన చేతిలోకి తీసుకుని నెమ్మదిగా ముందుకు నడిపించారు. కళ్ళు తెరచి చూస్తే అది కల అని తెలిసింది.

కానీ నా కల వమ్ము కాలేదు. నిజంగానే బాబా నా చేతిని పట్టుకుని ముందుకు నడిపించినట్లు ... ఆ దరిమిలా రాయడానికి పూనుకున్న నా పరిశోధనా వ్యాసాంగం ఏమాత్రం ఆగలేదు. చివరాఖరుకు యం.ఫిల్ లో మంచి మార్కులతో ప్రథమ శ్రేణిలో ప్యాసయ్యాను. మరోమాట ఏమంటే, ఆ తర్వాత్తర్వాత కూడా నాకెప్పుడు ఎలాంటి సందేహం వచ్చినా మెహెర్‌బాబా కలలో కన్పించి తగిన సూచనలు చేసేవారు. నాకు వచ్చిన ప్రతి కలా నిజమయింది. ఆ మాదిరిగా నా థీసీస్ బాబా సహాయంతోనే పూర్తయిందని నా గట్టి నమ్మకం.

కాగా, చాలా రోజుల తర్వాత తిరిగి విశాఖలోని కైలాసకోన కొండపైకి వెళ్ళినప్పుడు తొలిసారిగా ఇక్కడున్న మెహెర్‌బాబా సెంటర్‌ను చూసి లోనికి వెళ్ళాను. అక్కడున్న బాబా ప్రేమికులు శ్రీ సత్యనారాయణ గారితో పరిచయం చేసుకున్నానని, ఆమె చెప్పడం ముగించారు.

ఇదంతా అవతారుని కార్యక్రమమే కదా!

❀

# మెహెర్‌బాబాతో కృష్ణ నాయర్



ఆంగ్ల మూలం: **TEARS OF JOY**

శ్రీ అన్నా ఖండాలే, మెహెరాబాద్.

తెలుగు సేత: మల్లాది కృష్ణానంద్.

## గోడమీద రక్తపు మరకలు

కృష్ణనాయర్ 62 సంవత్సరాలు పైగా అవతారుని సన్నిధిలో గడిపాడు. ఆయన అనుభూతులు - అనుభవాలు ఎన్నో - ఎన్నెన్నో!! - పరిశీలించండి!

ఏ సంవత్సరమో ఇతమిద్దంగా గుర్తులేదు.

మెహెర్‌బాబా మెహెరాజాద్‌లో వున్నారు. నేను ఎప్పటిలా రాత్రిపూట బాబా గది బయట కాపలాదారుడిగా వున్నాను. అలాంటి సమయంలో డ్యూటీలో ఎవరున్నా వారు అటూ - ఇటూ కదలరాదు. చిన్నపాటి కదలికకు కూడా బాబావారు డిస్టర్బ్ అవుతారు. దానివల్ల స్థానువులా కదలకుండా డ్యూటీలో వున్నంతసేపూ వుండాలి.

ఒకసారి ఏమయిందంటే అలా డ్యూటీలో వున్నప్పుడు బాబా ఒక్కసారి కూడా లోనికి పిలవలేదు. ఏదైనా అవసరం పడితే బాబా చప్పట్లు కొట్టేవారు. ఆ శబ్దం విన్నాక లోనికి వెళ్ళి బాబా చెప్పిన పనులు చేస్తుండేవాడిని. అలాంటిది ఆ రోజు చాలాసేపు బాబా పిలువనేలేదు. బయట దోమలు గోల. అవి నన్ను కాటేసి పీకదాకా నా రక్తం త్రాగడం మొదలుపెట్టాయి. నేను వాటిని తరిమి వేయడం కానీ, లేదా చంపడం కానీ చేస్తే, అలా చేయడం వల్ల వచ్చే శబ్దం బాబాకు డిస్టర్బెన్స్ అని దోమలు కుదుతున్నా ఆ బాధను భరిస్తూ అలాగే చాలాసేపు కూర్చున్నాను.

ఇదిలా వుండగా బాబా బాత్‌రూంలోకి వెళ్ళినట్లు తెలిసింది. ఆ సమయంలో నా రక్తం త్రాగి నా ప్రక్కనే ఉన్న గోడ మీద సేద తీరుతున్న దోమలన్నింటినీ ఒక్క క్షణంలో చంపేశాను. ఆ దెబ్బకు ఓ నలభై దోమలు దాకా చచ్చివుంటాయి. దాంతో గోడంతా రక్తపు మరకలతో నిండిపోయింది. ఆ తర్వాత తెల్లవారాక నామానాన నేను డ్యూటీ దిగి నా గదికి వెళ్ళిపోయాను.

ఆ తర్వాత కొంత సమయానికి బాబా గది దగ్గరకి స్త్రీమండలి సభ్యులు మణీజా, మెహెరామయి - ఇంకా కొందరు వచ్చారు. అలా వారు బాబా గదిలోకి వెళ్తూ, గోడమీద రక్తపు మరకలు చూసి ఆశ్చర్యపడి ఆ విషయాన్నే బాబాతో ప్రస్తావించారు. బాబా నన్ను తక్షణం రమ్మనమని కబురు చేశారు. నేను బాబా ఎదుట అంతక్రితం జరిగిన సంగతంతా చెప్పాను. నన్ను దోమలు ఎలా బాధించిందీ, ఆ దరిమిలా నేను వాటిని చంపిన వైనాన్ని బాబాకు చెప్పాను. బాబాపట్ల నా విధేయతకు ఆయనెంతో సంతోషించారు. 'శభాష్' అన్నారు.

## నిరంజన్ పూర్

1946 మే నెలలో బాబా డెహ్రాడూన్‌కు సమీపంలోని నిరంజన్‌పూర్ అనే గ్రామంలో బస చేశారు. నేనెప్పటిలాగానే బాబా గది బయట రాత్రిపూట కాపలా వున్నాను. దోమలు కుట్టి చంపేస్తున్నాయి. ఐనా కూడా ఎలాంటి చప్పుడూ కాకుండా నెమ్మదిగా నన్ను కుదుతున్న దోమల్ని చంపుతున్నాను. బాబా గది బయట కాపలా ఎవరు వున్నా కూడా అటు ఇటు కదలకుండా ఎలాంటి శబ్దం రాకుండా, ఒక రాయిలాగా కదలకుండా వుండాలి. కానీ, నేను దోమల బాధ భరించలేక ఒకటి రెండింటిని చంపిన శబ్దానికి బాబా చాలా చిరాకుపడ్డారు. దీంతో బాబా నన్నయితే ఒక అరగంటకు పైగా ఏకధాటిగా చీవాట్లు పెట్టారు.

దాంతో నాకు బాబాపై వల్లమాలిన కోపం వచ్చింది. భగవంతుడినని చెప్తాడు. ప్రేమ స్వరూపుడని అంటాడు. ఇంత మాత్రం శబ్దం భరించలేని ఈయన దేవుడేనా? దెయ్యమా? అని మనస్సులో బాధతో అనుకున్నాను.

ఓ గంట అయ్యాక, బాబా నన్ను పిలిచారు.

ఏమి ఆలోచిస్తున్నావ్? అని అడిగారు.

ఏమీ లేదన్నాను.

లేదు. నిజం చెప్పమని - గట్టిగానే అడిగారు.

నీవు భగవంతుడివేనా? దెయ్యానివా? అని అనుకుంటున్నానని నిజం చెప్పేశాను.

బాబా ఏం అనలేదు.

చిరునవ్వులతో రేపు ఉదయాన్నే నాతో రా! అన్నారు.

నేను రేపు హరిద్వార్‌కు వెళ్తున్నాను.

శ్రద్ధగా విను!

రేపు ఉదయాన్నే **రానో** (అమెరికా నుండి వచ్చి స్థిరపడిన బాబా ప్రేమికురాలు) నీకు టీ ఇస్తుంది. ఆ తర్వాత తెల్లవారుఝామున 5 గంటలకు బ్రేక్‌ఫాస్ట్ పూర్తిచేసి ఒక టాంగా తీసుకొస్తే, హరిద్వార్‌కు వెళ్దాం అన్నారు. నా డ్యూటీ తెల్లవారుఝామున

4 గంటలకల్లా పూర్తయింది. వెంటనే స్నానం ముగించుకుని టాంగా కోసం బయటకెళ్ళాను. ఈలోగా నేను కనబడకపోయేసరికి, నాకోసం బ్రేక్‌ఫాస్ట్ తీసుకొచ్చిన రానో బాబాకు నాగురించి చెప్పింది. నేను బయటకు వెళ్ళి టాంగా తీసుకొచ్చేసరికి, బాబాకు కోపం వచ్చింది. బ్రేక్‌ఫాస్ట్ – టీ – పూర్తయ్యాక టాంగా తీసుకు రమ్మనమని చెప్పాను. ముందే ఎందుకు వెళ్ళావ్? అని చిరాకు పడ్డారు.

సాధారణంగా ఉదయాన్నే ఈ ప్రాంతంలో టాంగాలు దొరకడం కష్టం. అందుకోసం, ముందుగా టాంగా ఒకటి వెదుక్కోవడం మంచిదని – అలా వెళ్ళానని బాబాకు వినమ్రంగా చెప్పాను.

నీ తెలివితేటలు ఎందుకు ఉపయోగించడం?

నే చెప్పింది చేయడం అలవాటు చేసుకో.

ఇది మంచి పద్ధతి కాదు.

చెప్పింది చేయడం నేర్చుకో! అని బాబా గట్టిగా చివాట్లు పెట్టారు.

ఆ తర్వాత నా ఫలహారం – గట్రా పూర్తయ్యాక, బాబాతో కల్సి టాంగాలో హరిద్వార్‌కు బయల్దేరాను.

నాకు బాబాపట్ల కోపంగానే వుంది. రాత్రంతా కాపలా వున్నాను. తెల్లవారుఝామున 4 గంటలకు గదికి వచ్చి స్నానం చేసి వెంటనే ఆయనతో కలిసి బయల్దేరాను. ఒక్క క్షణం విశ్రాంతి లేదు. ఐనా సరే, ఇంకా ఏదో తక్కువైనట్లు చిరాకు పడుతున్నాడాయన. ఇదేం దేవుడో... ఏమో...అని మనస్సులో అనుకున్నాను.

అలా వెళ్తుంటే దారిలో నాలుగైదు చోట్ల ఖాళీ టాంగాలు కనిపించాయి. దాంతో – చూశావా! ఈ టైంలో టాంగాలు దొరకవన్నావ్! – చూశావా! కనబడుతున్నాయా! ఖాళీగా ఎన్ని టాంగాలున్నాయో అని బాబా ఎకసెక్కం చేశారు. ఆదరిమిలా రైలెక్కి హరిద్వార్‌కు చేరుకున్నాం. ఓ ధర్మశాలలో బస చేశాం. ధర్మశాలలో గదిలోకి చేరాక – బాబా ఏమన్నారంటే, గది బయట గడియవేసేసి, బయటకెళ్ళి **'మౌజ్‌వాలా బాబా'** ఎక్కడ వుంటారో కనుక్కోమన్నారు.

నేనంతా కనుక్కుని తిరిగి వచ్చాను. ఆ బాబా అక్కడ్నుంచి సుమారు 4 మైళ్ళ దూరంలో వుంటారని చెప్పాను. సాధారణంగా మౌజ్‌వాలా బాబా గంగానదిలో – నీటిలో ఏడురోజులుంటాడు. ఎనిమిదవ రోజున మాత్రం నది ఒడ్డునే గల తన పర్ణశాలలో వుంటాడు. మేము ఆయన దగ్గరకు వెళ్ళినప్పుడు ఆయన తన పర్ణశాలలోనే వున్నాడు. ఆయన చాలా పొడవుగా వున్నాడు. ఆయన కేవలం మంచి నీళ్ళు మాత్రమే త్రాగి జీవిస్తాడు. ఐతే, ఆయనతో బాబా చాలాసేపు ఏకాంతంగా గడిపారు. చివరలో ఆయన బాబాని తనకు కారప్పూస కావాలని అడిగాడు. బాబా నన్ను పోయి తీసుకు రమ్మని పురమాయించారు. నేను తీసుకొచ్చి ఇచ్చాను. తీరా తీసుకొచ్చాక, నాకు ఇవి వద్దు





ఆపిల్ పండు కావాలన్నాడు. కావాలంటే మీరే కారప్పూస తినండి, నేనేం అనుకోనని అన్నాడు. ఆదరిమిలా మేము అక్కడ్నుంచి తిరిగి వెళ్తూ ఆ కారప్పూసని నేను నోట్లో వేసుకోవడం చూసి బాబా ఆ పొట్లాన్ని దూరంగా గిరవాటేయమని ఆదేశించారు. బహుశా, ఇందులోని ఆంతర్యం అవతారునికే ఎరుక అనుకున్నాను.

## నంగా బాబా

మేం అలా టాంగాలో వెళ్తుండగా, బాబా నాకేసి చూసి, దగ్గరలో ఎవరైనా మస్తులున్నారేమో టాంగా వానితో కనుక్కోమని నాకు సంజ్ఞలతో చెప్పారు.

దగ్గర్లోనే నంగా బాబా అనే గొప్ప మస్తు వున్నాడని – టాంగావాలా జవాబిచ్చాడు. సుమారు 3 మైళ్ళ దూరంలో ఆయన ఆశ్రమం ఉందని చెప్పాడు. ఆయన కొన్ని సంవత్సరాలపాటు ఒక చెట్టు నీడలో ఒంటికాలిపై నిలబడతాడని, మరో ఆరునెలలు తర్వాత మరోకాలిపై నిలబడతాడని టాంగావాలా చెప్పాడు.

నంగా బాబా ఆశ్రమం దాకా టాంగా వెళ్ళదని చెప్పి, ఆశ్రమానికి కొద్దిపాటి దూరంలో టాంగాని నిలిపివేసి, అక్కడ నుంచి నడడి వెళ్ళాలని చెప్పాడు. అలాగే నేనూ – బాబా ఇద్దరం టాంగా దిగి నంగా బాబా ఆశ్రమం దాకా నడిచి వెళ్ళాం. మేం తిరిగి వచ్చేదాకా టాంగా వాడిని వేచివుండమని చెప్పారు బాబా. ఐతే అందుకు అదనంగా కొంత డబ్బు చెల్లించాలన్నాడతను. అందుకు బాబా అంగీకరించారు.

సుమారు ఒకటిన్నర మైలు దూరం ఆ మస్తు ఆశ్రమం దాకా బాబా కాలి నడకన నడిచారు. అలా వెళ్ళిన బాబాని చూస్తూనే నంగా బాబా – బాబాకు స్వాగతం పలుకుతూ – రెండు చేతులూ జోడించి నమస్కరించాడు. సాక్షాత్తూ భగవంతుడు తనకోసం వచ్చాడని గట్టిగా అమితానందంతో స్వాగతం పలికాడు. తాను ఎన్నేళ్ళనుంచో బాబా రాక కోసం పరితపిస్తున్నానని అన్నాడు. ఇన్నాళ్ళకు దయచేసావయ్యా అంటూ – తనకు మోక్షం ప్రసాదించమని ప్రార్థించాడు. బాబా పాదాలపై పడి తన కన్నీళ్ళతో బాబా పాదాలు కడిగినంత పనిచేశాడు.

ఇదంతా నా కనులారా చూసి – నా తప్పిదం ఏమిటో తెలుసుకున్నాను. చాలాసేపు పశ్చాత్తాప పడ్డాను. భగవంతుని దగ్గరగా వుంటూ – ఆయన్ని సైతాన్‌గా భావించానేనని బాధపడ్డాను. బాబా దర్శనం కోసం పరితపించిన నంగా బాబాను చూశాక నా తప్పేమిటో అర్థమయింది.

నంగా బాబా చాలాకాలంగా ఒంటి కాలిపై నిలబడటమే కాదు – కఠిన మౌనంగా కూడా ఉంటున్నాడు. బాబాను దర్శించుకున్నాకనే – తనకిక ఈ దేహం నుండి విముక్తి కల్పించమని బాబాను వేడుకున్నాడు.

భగవంతుని దర్శనం లభించాక – ఇంకా ఈ దేహంతో బ్రతికి వుండటం వృధా అని

నంగా బాబా పేర్కొన్నాడు. ఆ దరిమిలా మేం నిరంజన్ పూర్‌కి తిరిగి వెళ్ళిపోయాం. ఆ పిదప రెండ్రోజుల తర్వాత బాబా కొన్ని పూలు, ఒక కప్పు నిండా మంచినీళ్ళు ఇచ్చి నంగా బాబా దగ్గరకు వెళ్ళిరమ్మనమని నన్ను ఒంటరిగా పంపారు.

నేను నంగా బాబా ఆశ్రమం దాకా వెళ్ళేసరికి, ఆయన చుట్టూతా పెద్దఎత్తున జనం గుమ్మిగూడి వున్నారు. ఆ రోజు ఉదయాన్నే నంగా బాబా దేహం త్యాగం చేశారని తెలిసింది. అక్కడున్న ఆశ్రమంలోని యువకుడు నన్ను చూసి – మెహెర్‌బాబా సాక్షాత్తూ విష్ణుమూర్తి – ఆయన దర్శనం కోసమే నంగా బాబా ఇన్నాళ్ళూ వేచివున్నాడు. ఇప్పుడు తనకా భాగ్యం లభించింది, ఇక శెలవు అని నంగా బాబా తనతో చెప్పినట్లు ఆ శిష్యుడు నాతో చెప్పారు.

నంగా బాబా పార్థివ శరీరానికి నమస్కరించి, బాబా ఇచ్చిన పూలు ఆయన దేహంపై వుంచి, కప్పుతో తెచ్చిన నీళ్ళను ఆయనపై చల్లాను.

నంగా బాబా శిష్యులు బాబా దగ్గరకు రావాలని బయల్దేరారు. ఐతే వారందరూ తమ గురువు ఆదేశాలను – బోధనలను పాటించమని, అనుసరించాల్సిందిగా వారితో చెప్పమని బాబా నాతో తన సందేశం పంపారు. వారి ఎడల తన 'నజర్' ఎల్లవేళలా ఉంటుందని, కాబట్టి బాబా దగ్గరకు తక్షణమే రావల్సిన పనిలేదని నన్ను చెప్పమన్నారు. నేనా మాదిరిగానే వారందరికీ చెప్పాను.

## ఆడవాళ్ళంటే నాకిష్టమే లేదు

ఆగష్టు 1946, ఆ సమయంలో బాబా రిషీకేష్‌లో వున్నారు. ఈ సమయంలో మా స్వగ్రామంలో నా వివాహం కూడా అయింది. చాలా సంవత్సరాల క్రితం బాబా సమక్షంలో ఈ సంఘటన జరిగింది,

ఆ సమయంలో నేను బాబాతో పాటు డెహ్రాడూన్‌లో వున్నాను. మా బంగళాకు ఎదురుగా ఒక ఆడపిల్లల స్కూలు వుంది. ఓ నలుగురు ఆడపిల్లలు నన్ను ఎప్పుడూ గమనిస్తూ ఉండేవారు. అందులో ఒక అమ్మాయి, ఓ రోజున తనతో సాయంత్రం పూట వాహ్యాళికి రమ్మనమని అడిగింది. అలాంటిదేమీ కుదరదని నిక్కచ్చిగా వారితో చెప్పేశాను. దాంతో ఆ అమ్మాయి బాధతో జరిగినదంతా బాబా ఎదుట నా గురించి ఫిర్యాదుగా చెప్పింది. బాబా నన్ను చివాట్లు పెట్టారు. నాకు ఆడవాళ్ళన్నా, వాళ్ళతో స్నేహమన్నా ఇష్టం లేదనీ, వారిని తాకడం సుతరామం ఇష్టం లేదని నా మనస్సులోని మాటను బాబాకు చెప్పాను.

ఐతే పెళ్ళి కూడా చేసుకోవా? నీకు త్వరలో పెళ్ళవుతుంది. ఒక కొడుకు కూడా పుడతాడు అని బాబా నాతో అన్నారు. లేదు – బాబా – నేను పెళ్ళి చేసుకోను. నాకు పెళ్ళంటూ వద్దే వద్దు అని బాబాతో తిరిగి అన్నాను.





నిజంగా పెళ్ళి చేసుకోవా?

నాతో చాలెంజ్ చేస్తున్నావా?

లేదు బాబా – చాలెంజ్ కాదు – ఏమీ కాదు – కానీ – పెళ్ళంటూ చేసుకోను బాబా అని రెండుసార్లు స్పష్టంగా అన్నాను.

అదేమీలేదు – నీకు తప్పక వివాహమవుతుంది అని గట్టిగా చెప్పారు. నేనూ అంతే గట్టిగా నాకు పెళ్ళి వద్దు – నేను పెళ్ళి చేసుకోను బాబా అని చెప్పాను.

అలాగా అని బాబా దగ్గర్లోనే విష్ణు మాస్టారుని పిలిపించారు.

డా. నీలూని పిలిచారు. డా. నీలూని నా చూపుడు వేలు నుంచి రక్తం తీసుకొని, ఒక తెల్ల కాగితంపై

'నేను పెళ్ళి చేసుకోను' అని రాయమన్నారు.

అలా రాసిన కాగితాన్ని జాగ్రత్తగా పరీక్షించి, భద్రపరచమని – మండలి సభ్యుడైన విష్ణు మాస్టారుకు అప్పజెప్పారు. ఆ తర్వాత నాలుగేళ్ళ వరకు నా పెళ్ళిమాట ఎక్కడా ప్రస్తావించలేదు.

## నా పెండ్లి గురించి...

జూలై 1946లో బాబా నన్ను పిలిచి ఒక నెలరోజులు సెలవు ఇచ్చానన్నారు. మా ఊరు వెళ్ళి, మా ముసలి తల్లిని చూసిరమ్మన్నారు. అంతేకాదు మా అమ్మ ఏమి చెబితే దాన్ని ఆలకించి, ఆచరించమన్నారు.

ఆమె మనస్సు నొప్పించవద్దన్నారు.

నేను బాబా దగ్గరకు వచ్చి చేరినప్పటి నుంచీ మా అమ్మకు ప్రతి నెలా 30 రూపాయలు ఆమె ఖర్చుల కోసం పంపుతున్నారు.

చాలా సంవత్సరాల తర్వాత మా స్వగ్రామం చేరాను. ఇంతకాలం బాబా సేవలోనే గడిపాను.

నన్ను చూసిన మా అమ్మ చాలా సంతోషించింది. ఆ తర్వాత నాలుగైదు రోజులకు ఆమె నా పెళ్ళి గురించి ఒత్తిడి చేయడం ప్రారంభించింది. నేనెంత చెప్పినా – ఆమె నా మాటలు ఖాతరు చేయలేదు.

బాబా నాకు ముందుగానే చెప్పారు కదా!!

తల్లి ఏది చెబితే దాన్ని తుచ తప్పక పాటించమన్నారు.

ఆమె మాటను శిరసావహించమన్నారు. ఆమెను సంతోషపెట్టమన్నారు.

బాబా మాటలు గుర్తుకు తెచ్చుకుని బాబాకు ఓ రోజున నా పరిస్థితి గురించి వివరిస్తూ లేఖ రాశాను. ఆ వెనువెంటనే బాబా నుండి **OBEY YOUR MOTHER WORDS** అని టెలిగ్రాం వచ్చింది. ఇది తెలిసి మా అమ్మ చాలా సంతోషించింది. ఆ తర్వాత ఓ

12 రోజుల్లోనే నా పెళ్ళి నిశ్చయించడం, వివాహం జరిపించడం జరిగిపోయింది. పెళ్ళయిన మర్నాడే బాబావారి నుండి టెలిగ్రాం వచ్చింది. ఉన్నఫళంగా డెహ్రాడూన్‌కు వచ్చేయమని బాబా ఆదేశించారు.

ఈ విషయం తెలిసి ఇంట్లోని వారందరూ ఆశ్చర్యపడ్డారు. ఆదే క్షణంలో కంగారు పడ్డారు. ఏం చేయాలో ఎవరికీ పాలుపోలేదు. గమ్మత్తు ఏమంటే – నా భార్య మాత్రం తొణక లేదు – బెణక లేదు.

బాబావారి ఆదేశాలను విధేయతతో పాటించమని నాకు ధైర్యం చెప్పింది.

నేను వెంటనే బయల్దేరి రిషేకేష్‌లో వున్న బాబాను కలుసుకున్నాను.

నేను బాబావారున్న గదిలోకి ప్రవేశించగానే అక్కడున్న

వారందరినీ బయటకెళ్ళమన్నారు.

నీ పెళ్ళయిందా? అని అడిగారు.

నీ భార్య అందంగా వుందా?

నిన్ను ప్రేమిస్తుందా? అని కుశల ప్రశ్నలు అడిగారు.

పెళ్ళయ్యిందని చెబుతూ, ఆమె ప్రేమిస్తుందో? లేదో? ఎలా చెప్పాలి!!

పెళ్ళి అయ్యాక కేవలం 8 గంటలు మాత్రం ఆమెతో కలిసి వున్నానని చెప్పాను.

ఆమె నీకన్నా మంచిది.

నీకన్నా ఆమె నిన్ను ప్రేమిస్తుందని బాబా అన్నారు.

ఆ దరిమిలా నన్ను నిరంజన్‌పూర్‌కు వెళ్ళమన్నారు.

అక్కడ ఎక్కడా ఎవరితో కూడా నా పెళ్ళయినట్లు చెప్పవద్దన్నారు.

ఇలా ఒకటిన్నర సంవత్సరం తర్వాత నా స్వగ్రామం తిరిగి వెళ్ళేందుకు బాబా అనుమతిచ్చారు.

నెలరోజులు సెలవిచ్చారు.

నెలరోజులు సెలవిచ్చినా – 25 రోజులకే వచ్చేమని కబురు పంపారు.

1947 నవంబరులో బాబా మస్తుల పర్యటన ముగించుకుని మెహెరాజాద్‌కు చేరారు.

ఆరోజుల్లో చంద్రభాన్(18) అనే కుర్రాడు కాకాబారియాకు సహాయకుడిగా వుండేవాడు.

అతను నామాట వినేవాడు కాదు.

ఇదే మాదిరిగా జరిగితే నేను ఒకసారి అతనిపై చేయిచేసుకున్నాను.

ఇది తెలుసుకున్న బాబా నన్ను ఓ రోజున ప్రక్కగా పిలిచి, గట్టిగా చీవాట్లు పెట్టి, ఇక మా ఊరికి వెళ్ళిపొమ్మనమని ఆదేశించారు.

ఎంతో బాధతో బాబా చెప్పినట్లు నా స్వగ్రామం చేరాను.





# నవజీవనంలో పాల్గొనే అవకాశం నాకు చిక్కలేదు

బాబా కొంతమంది మండలివారితో కలిసి 1949 అక్టోబరు 16 నుండి నవజీవనం గడపనున్నారని తెలిసింది. దాంతో నేను ఆగష్టు 1949లో మెహెరాజాద్‌కు తిరిగి వచ్చాను. నేనూ నవజీవనంలో పాల్గొనాలనుకున్నాను.

అలా నేను మెహెరాబాద్‌కు చేరాక నాకు కొడుకు పుట్టాడని మా ఇంటి నుంచి ఒక ఉత్తరం వచ్చింది.

నేను ఆ ఉత్తరాన్ని చదువుతుంటే బాబా నా ప్రక్కనే వచ్చి నిల్చున్నారు.

ఆయన ఏమీ ఎరుగనట్లు విశేషం ఏమిటి? అని అడిగారు.

కొడుకు పుట్టాడని చెప్పాను. ఐతే ఈ విషయాన్ని ఎవరికీ చెప్పొద్దని బాబా నన్ను హెచ్చరించారు. ఆ దరిమిలా మండలి హాలులో అందరూ హాజరయిన సమయంలో బాబా నన్ను ఉద్దేశించి – నీ భార్యా – పిల్లవాడు ఎలా వున్నారని? ప్రశ్నించారు.

మండలివారంతా ఆశ్చర్యపడ్డారు.

నాకు పెళ్ళి ఎప్పుడయింది, పిల్లవాడు ఎప్పుడు పుట్టాడని? మండలివారందరూ నన్ను ఆటపట్టించారు.

డాక్టర్ ఘనీ అయితే మరొక అడుగు ముందుకేసి – కృష్ణకు పెళ్ళి కాకుండా కొడుకు పుట్టాడా? బాబా! ఏమి నీ మహత్యం!!! అని బాబా అడిగాడు.

ఇలా కబుర్లు దొర్లుతున్నప్పుడు బాబా విష్ణుమాస్టర్‌ని పిలిచి గతంలో 1942లో నేను పెళ్ళి చేసుకోను అని రక్తంతో రాసిన లేఖను తీసుకురమ్మన్నారు.

45 నిముషాలు వెదికి ఆ కాగితాన్ని విష్ణు పట్టుకొచ్చాడు.

ఆ కాగితాన్ని చూపిస్తూ – వీడు – పెళ్ళి చేసుకోనని, నాతో బీరాలు పలికాడు.

నాతో ఛాలెంజి చేశాడు.

ప్రస్తుతం వీడు పెళ్ళి చేసుకున్నాడు.

ఒక కొడుకు కూడా అని బాబా అనేసరికి – బాబాతో పాటు – అందరూ అని గట్టిగా నవ్వుకున్నారు.

మాకు ఈ శుభసమయంలో మంచి స్వీటు **'బాసుంది'** కావాలని డా. నీలూ అడిగేసరికి,

నీవు నాకేసి చూడకు.

నేను కాదు పెళ్ళి చేసుకుంది.

కృష్ణడే బాసుందీ ఇవ్వాల్సిందని బాబా నవ్వుస్తూ అన్నారు.

ఓ బాబా – నా దగ్గర డబ్బులు ఎక్కడున్నాయి – అని నేననగానే,

బాబానే అందరికీ బాసుందీ ఏర్పాటు చేశారు.

ఆనందంగా అందరం సంబరాలు చేసుకున్నాం. ❀

# వార్డ్ పార్క్స్



వార్డ్ పార్క్స్ అమెరికా దేశీయుడు. ఇంగ్లీషు ప్రొఫెసర్. అమెరికాలోని లూసియానా స్టేట్ యూనివర్శిటీలో మిడీవియల్ ఇంగ్లీషు ప్రొఫెసర్‌గా పనిచేస్తూ, అవతారుని నామం విని, సంపూర్ణంగా ఆయన పాదాలకు అంకితమై 1993లో మెహెరాబాద్‌కు వచ్చి స్థిరపడినాడు. ప్రస్తుతం 1920వ దశకంలో మెహెర్‌బాబావారి ప్రవచనాలు గల సుమారు 750 పైగా పేజీలు గల బాబా సాహిత్యాన్ని బాబా ప్రేమికులందరికీ అందజేసే ప్రయత్నం చేస్తున్నాడాయన. ఇంకా వివరంగా చెప్పుకోవాలంటే 1926 – 27 మధ్య కాలంలో ఆనాటి బాబా కార్యదర్శి దాదా ఛాంజీ రాసుకున్న నోట్సులోని ముఖ్యాంశాలను వెలికితీసే ప్రచురించే ప్రాజెక్టుకు సంపాదకత్వ బాధ్యత వార్డ్ పార్క్స్ చేపట్టాడు.

ఇటీవల కొన్ని నెలల క్రితం వార్డ్ పార్క్స్ తాను చేపట్టిన ప్రచురణల పర్వంలో భాగంగా హైదరాబాద్ వచ్చినప్పుడు మెహెర్‌బాబా పత్రిక ప్రతినిధి ఇష్టాగోష్ఠిగా ఆయనతో మాట్లాడ్డమైంది.

ఆ సందర్భంలో వార్డ్ పార్క్స్ తనకు సంబంధించి ఎన్నో ఆసక్తికర విషయాలు చెప్పారు. ఆ పదాలు ఇకపై ఆయన మాటల్లోనే పరిశీలించండి!!

‘‘ నేను బుద్ధుడిని అవతారునిగా భావించేవాడిని. ఒక సమయంలో నాకు నేను బౌద్ధ బిక్షుకునిగా ఊహించుకునేవాడిని. ఇలాంటి సమయంలో, అది 1970 ప్రాంతంలో ప్రముఖ బాబా ప్రేమికులు అలెన్ ఖోయెల్ **– మాదక ద్రవ్యాల వినియోగం – మెహెర్‌బాబా ప్రవచనాలు – ఈ అంశంపై** హర్వర్డ్ యూనివర్శిటీ ఆడిటోరియంలో ప్రసంగిస్తున్నాడని తెలిసింది. నగరంలో ఆనాడు పలుచోట్ల వాల్‌పోస్టర్లు అతికించారు. ఇవన్నీ చూసి, అలెన్ ఖోయల్ ప్రసంగం విందామని నేను హర్వర్డ్ యూనివర్శిటీకి వెళ్ళాను.

సుమారు 2 వేల మంది హాజరయ్యారు. అది చాలా పెద్ద ఆడిటోరియం.

ఆ మాదిరిగా తొలిసారిగా అవతార్ మెహెర్‌బాబా పేరు ఆనాటి సమావేశంలో విన్నాను. ఆతర్వాత బాబా సాహిత్యం కొంతభాగం చదివాను. మెహెర్‌బాబా ప్రకటించిన

**I AM THE HIGHEST OF THE HIGH; I AM THE ANCIENT ONE**

ఈ పదాలు నా హృదయాన్ని తాకాయి. ఈ పదాలు నా చెవుల్లో మారుమ్రోగుతుండేవి. నేను ఆరాధించే బుద్ధుడు – అవతార్ మెహెర్‌బాబా ఒక్కరేనేమో అనే నమ్మకం కల్గింది.





ఆ తర్వాత, ఉత్సుకతతో అమెరికాలోని మెర్టిల్‌బీచ్‌లోని బాబా సెంటర్‌కు వెళ్ళాను. అక్కడ బాబా ప్రేమికులు కిట్టీ డేవీ, ఎలిజబెత్ పాటర్‌సన్‌లు నాకు మరింత బాబా సాహిత్యం అందజేశారు. మెహెర్‌బాబా గురించి మరెన్నో విషయాలు చెప్పారు. దాంతో మెహెర్‌బాబా పట్ల నాకున్న సందేహాలన్నీ పటాపంచలయ్యాయనిపించింది. అప్పటిదాకా నాలో రగులుతున్న ఊగిసలాట, మీమాంశలు సమసిపోయాయి. మెహెర్‌బాబా పట్ల గట్టి నమ్మకం కల్గింది.

దాదాపు ఈ సమయంలో అంటే 1972లో తొలిసారిగా మెహెరాజాద్‌కు బాబా దర్శనార్థం వెళ్ళాను. ఆరు వారాలు మెహెరాజాద్ – మెహెరాబాద్‌లలో వున్నాను. మెహెరాజాద్‌లోని మండలి హాలులో ఏరుచ్ భాయ్ ప్రసంగాలు ప్రతిరోజూ క్రమం తప్పక విన్నాను. ఏరుచ్ భాయ్ బాబా గురించి ఎన్నో సంగతులు చెప్పాడు. ఆ తర్వాత అమెరికా వెళ్ళిపోయినా, ఇంగ్లీషు ప్రొఫెసర్‌గా లూసియానా స్టేట్ యూనివర్శిటీలో ఉద్యోగం చేసుకుంటూ నాలుగు రూపాయలు పొదుపు చేసుకుని ప్రతి రెండేళ్ళకోమారు బాబా దర్శనార్థం మెహెరాజాద్ / మెహెరాబాద్‌లు వస్తూ పోతున్నాను.

ఇలా వుండగా బాబా ట్రస్టు చైర్మన్ భావూ కల్చూరీ కోరిక మేరకు, 1993లో శాశ్వతంగా మెహెరాబాద్‌కు వచ్చి స్థిరపడ్డాను. కాగితాలకే పరిమితమై వున్న అనంతమైన బాబా సాహిత్యాన్ని ఎడిట్ చేసి ప్రచురణ బాధ్యత చేపట్టాను. ఈ పనంటే నాకెంతో ఇష్టం. నాకు బాగా చేతయిన పని కూడా !! అందుకే బాబా నన్ను ఇలా ఎంచుకున్నాడేమో! అన్నారు.

## ‘గాడ్ స్పీక్స్’

వార్డ్ పార్క్స్ మెహెర్‌బాబా రాసిన భగవద్వచనం ‘గాడ్ స్పీక్స్’ గ్రంథాన్ని సుమారు 20 – 25 సార్లు పఠించానని, దాదాపుగా ఈ గ్రంథాన్ని అర్థం చేసుకున్నానని ఆయన అంటాడు. ఈ అవతార కాలంలో మెహెర్‌బాబా తన ప్రేమికులకు ఇచ్చిన గొప్ప బహుమతి భగవద్వచనం అని ఆయన అంటాడు. **This is a biography of soul** ‘ఆత్మ’ యొక్క జీవిత చరిత్ర అని పార్క్స్ అభివర్ణిస్తాడు. ఆత్మ ప్రారంభం నుండి భగవదైక్యం పొందేదాకా ఈ గ్రంథంలో చక్కగా వర్ణించబడిందని ఆయన అంటాడు. ఈ మాదిరిగా గత అవతారకాలంలో చెప్పని విషయాలను బాబా ఈ అవతార కాలంలో ఎంతో వివరంగా చెప్పారని ఆయన అంటాడు. అనంతమైన నిధి ఈ గ్రంథాలలో దాగివుంది. తినగ తినగ వేప తీయగుండు – లాగా – చదవాలి! చదవగా – చదవగా ఈ గ్రంథాలు అర్థమవుతాయి. ఎన్నో క్రొత్త విషయాలు తెలిసొస్తాయి అని అంటారాయన. ఐతే, **This book is defenitely not meant for all** అనీ అన్నారు.



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

**ఆంగ్ల మూలం: - భావూ కల్చురీ, లార్డ్ మెహెర్, వాల్యూం-3 (1925-29) - తెలుగుసేత: మల్లాది రామారావ్, న్యూఢిల్లీ**

*(గత సంచిక తరువాయి)*

ఎంత అదృష్టవంతులో ఈ ఇద్దరూ.

వీళ్ళ బస, అబ్దుల్లా ప్రక్కగదికి మారింది.

అక్టోబరు 13వ తేదీ మధ్యాహ్నం పెద్ద ఆదీ, నౌసేర్వాన్ సాథాల వెంట క్రిస్టియన్ లీక్ వచ్చాడు. రష్యన్ దేశస్థుడు.

బాబావారు నిన్న చెప్పింది ఇతగాడి గురించే అంటే ఇతని రాక బాబావారికి ముందుగానే తెలుసు. సర్వాంతర్యామికి తెలియకుండా చీమ అయినా కుట్టదని ఇందుకే అంటారేమో!

నిరాడంబరతకి మారుపేరులా కనిపిస్తున్నాడు లీక్ దొర గారు.

జుట్టు నెరసింది.

కాస్తా కూస్తానా పూర్తిగా తెల్ల ముగ్గు జుట్టులా వుందీ జుట్టు.

యాభై ఎనిమిది ఏళ్ళుంటాయి అతనికి.

ఇరవై ఏళ్ళుగా రామకృష్ణ పరమహంసని పూజిస్తున్నాడు.

ఎప్పటికయినా అంతటి సర్వోత్తముడైన గురువు దొరికితే బాగుణ్ణు, సేవించి తరించగలుగుతాను అనుకొనేవాడు.

ఆ కోరిక ఇంతకాలానికి తీరింది.

బాబావారి దర్శనంతో మనస్సు ఆనందంతో గెంతులు వేసింది.

ఏదో మరో లోకానికి వెళ్ళిన భావన కలిగిందీ రష్యన్ దేశస్థుడికి.

బాబావారు ఎన్నో దేశాలకి వెళ్ళారు కానీ రష్యాకి వెళ్ళలేక పోయారు.

ఎందుకో ఏమో!

ఇదొక లోటని చరిత్రకారులు తీర్మానిస్తారేమో.

పొరపాటు... పొరపాటు.. ... అని చెప్పడానికే అన్నట్లు బాబావారిని వెతుకుతూ లీక్ మహాశయుడు టోకా వచ్చారనీ, బాబావారి రష్యన్ కార్యక్రమానికి దోహదం చేశారనీ అంటే అతిశయోక్తి కాకపోవచ్చును.

లీక్ మహాశయుడు 1870లో పుట్టాడు.

ఇస్టోనియా రాష్ట్రంలో అతని జననం. అక్కడే పెరిగి పెద్దవాడయ్యాడు. ఆనాటి





కుర్రకారులుగా, చదువయ్యాక మాస్కో వచ్చి ఉద్యోగం సంపాదించాడు. 30 ఏళ్ళు వచ్చేసరికి పెద్ద కంపెనీలో మేనేజరుగా స్థిరపడ్డాడు. డబ్బుకి డబ్బు, హోదాకి హోదా రెండూ దొరికాయి.

కానీ మనిషిలో ఏదో అసంతృప్తి తొలిచేసేది.

చిన్నప్పటినుంచీ దైవ చింతన ఎక్కువ లీక్ మహాశయుడికి.

స్కూలు పాఠాలతో పాటు, ప్రాక్ పశ్చిమ తత్వ శాస్త్రాలని వంటబట్టించుకొన్నాడు.

ఏదో తెలుసుకోవాలి, మరేదో సాధించాలన్న తపన ముందుకు నడిపించేది. బహుశా అందుకనేనేమో, 1902లో ఉద్యోగానికి గుడ్‌బై చెప్పి, దేశ దిమ్మరి అయ్యాడు. ఇంగ్లాండ్‌కి వెళ్ళాడు. అక్కడి నుంచి ఫ్రాన్స్ వెళ్ళాడు. ఎందరో తత్వవేత్తలను కలిసాడు. మరెందరితోనో తాత్విక్ చర్చలు చేశాడు.

అయినా అతని మనస్సులో గుబులు పోలేదు.

మళ్ళీ ధనార్జనలో పడ్డాడు.

ఎంతటి వారికయినా ఆకలి బాధ తప్పదు కదా.

ఆ బాధ తీరాలంటే చేతిలో రూకలుండాలి.

అందుకనే మళ్ళీ ఉద్యోగ ప్రయత్నం మొదలపెట్టి ఓ నౌకలో ఆఫీసరుగా కుదిరాడు.

నౌకలో ఉద్యోగమంటే ఎన్నో వూళ్ళకి వెళ్ళటం, అక్కడి వింతలు, విశేషాలు చూడటం, కొత్త వ్యక్తులతో పరిచయం. అలా పరిచయమైన వ్యక్తి మెరెడిత్ స్టార్ దొర గారు.

ఆ మహానుభావుడి పేరు చెప్పే, లీక్ గారికి బాబా దర్శన భాగ్యం దొరికింది. అయితే మెహెరుని దర్శనం దొరకాలంటే మెహెరుని దయ వుండాలి. బాబా ఇచ్ఛ లేకపోతే దర్శనం ఆమడ దూరం నుంచి కూడా దొరకదు.

బహుశా స్టార్ -లీక్‌ల తొలి పరిచయం నాటికి బాబావారి దయకి లీక్ గారు అర్హుడయి వుండడు.

ఆ శుభ ఘడియ వచ్చే వరకూ ‘అన్వేషణ’ తప్పలేదు.

రామకృష్ణ పరమహంస గురించీ, వివేకానందుడి గురించీ చదివాడు. వెంటనే దక్షిణేశ్వర్‌కి వెళ్ళి, పరమహంస గదిని దర్శించాలన్న కోరిక పుట్టింది. అంతే ఇండియాకి

వచ్చాడు. అప్పటికి అతను ఉద్యోగం మానేసి ఎనిమిదేళ్ళు అయింది.

రామకృష్ణ ఆశ్రమంలో అడుగు పెట్టాడు.

అలా 1910 నుంచి లీక్ దొర గారి నవజీవనం ప్రారంభమయింది.

రోజులు, నెలలు గడుస్తున్నాయి.

సశరీరులైన సద్గురువుని దర్శించి, సేవించి తరించాలన్న కోరిక పెరిగింది.

నా కోరిక తీరుతుందా అన్న బెంగ కూడా పట్టుకుంది.

నిస్సహాయత, నిస్పృహ పెరుగుతున్నాయి.

ఏం చేయాలో పాలుపోవటంలేదు.

మెరెడిత్ స్టార్ గుర్తుకు వచ్చాడు.

ఇంగ్లీషు దొర గారు మెహెర్‌బాబాని దర్శించిన సంగతి చెవిన పడింది.

బాబా శరణు వొచ్చానయ్యా అంటా...

ఆయనకి ఓ ఉత్తరంలో ఎవరీ మెహెర్‌బాబా?

ఎక్కడ వుంటాడు?

ఆయన్ని కలవాలంటే ఎలాగ?

ఏం చేయాలి? అసలు బాబావారు నా వంటి సాధకుల్ని కలుస్తాడా?

ఆశ్రయం ఇస్తాడా?

ఎన్నో ప్రశ్నలు?

ప్రశ్నల వర్షం కురిపించాడు స్టార్ దొరపైన.

ఆ మహానుభావుడు ఏ కళ నున్నాడో..,

ఓపికగా జవాబు పంపాడు.

మెహెరాబాద్‌కి వెళ్ళే దారి చెప్పాడు.

అక్కడి నుంచి టోకా వెళ్ళాలని వ్రాశాడు.

అంటే బాబా దర్శనానికి పిలుపు వచ్చిందని చెప్పాలి.

ఆలస్యం దేనికి వెంటనే బయలుదేరాడు.

టోకాలో అడుగు పెడ్తూనే ఇది ఏదో ప్రత్యేక స్థలం అన్న భావన కలిగింది. ఇక్కడ ఏదో వుంది.

అది ఏమిటో మాటల్లో చెప్పలేను.

ఇదొక మధురానుభూతి.

ఇంతకాలం రామకృష్ణ పరమహంస వంటి మహోన్నతుల స్మరణలో గడిపాను.

వాళ్ళెవరూ మన కళ్ళముందు లేరు.

అంతటి సద్గురువులు ఎవరూ కనబడలేదు ఇంతవరకూ.

ఇప్పుడాలోటు తీరింది.





మెహెర్‌బాబావారి దర్శనం దొరికింది.

నా ఇరవై ఏళ్ళ తపస్సు ఫలించింది.

నా జీవితం ధన్యమైంది.

అనుకొన్నాడు మన రష్యన్ దొర గారు.

ఈయన్ని దొర అనటం కంటే సాధువు, ఋషి అనటం మంచిది.

దైవ చింతనలో పడిన అదృష్టవంతుడు.

లీక్ ఋషి గారికి టోకాలో బస ఎక్కడ?

ఇంకెక్కడ? అబ్దుల్లా నిన్నటి వరకూ వున్న గదిలోనే.

ఇది బాబావారి నిర్ణయం.

ఆ సంగతిని విష్ణు లీక్ గారికి చెప్పాడు.

గది చూపించి ఇందులో వుండండి అన్నాడు.

ఆయన మహదానందంతో సరే నన్నాడు.

ఆవేళ్ళకి అంటే డిసెంబరు 13వ తేదీ నాటికి బాబావారు ఏకాంతవాస దీక్ష పట్టి నాలుగు రోజులయింది.

ఉపవాస దీక్షకి 34వ రోజు.

సాయంత్రం ఐదు గంటలకి ధుని వెలిగించారు.

ధుని కోసం పిల్లలు పెద్దలు మంజిల్ ముంగిటికి వచ్చారు.

అందరికీ మిఠాయి ప్రసాదం పెట్టారు.

వేడి వేడి టీ ఇచ్చారు.

చలికాలం మొదలవటంతో, వేడి టీ త్రాగగానే వణుకు మాయమైంది.

బహుశా ఇది గమనించే బాబావారొక మాట శెలవిచ్చారు.

ప్రొద్దుటిపూట చలిగా వుంటుంది కదా.

కాసేపు ధుని దగ్గర కూర్చోండి.

చలి పారిపోతుంది అని పిల్లలకి చెప్పారు.

ఉదయం 7 గంటలకే ధుని వెలిగించమన్నారు.

సాయంత్రం పూట కూడా ధుని మంట వేయమన్నారు.

రెండు పూటలా ధునికి ఏర్పాట్లు చేయడం అంటే పుల్లలు, పిడకలు వగైరా తెచ్చే పని జాల్‌దీ అన్నారు.

ధుని వెలిగించడం ఛగన్ వంతు.

ధుని మంటని గట్టెక్కించడం బైదుల్ వంతు అని చెప్పారు.

ధుని ఎంతసేపు వుంచాలో చెప్పలేదు, కానీ ఉదయం, సాయంత్రం రెండుపూటలా ధుని వేయమన్నారు.

అక్టోబరు 14వ తేదీన పిలుపు వెళ్ళింది లీక్ గారికి.

'బాబావారు దర్శనం ఇస్తామన్నారు రండి' అని చెప్పారాయనకి.

వెంటనే వచ్చాడు.

వినమ్రంగా నమస్కరించాడు.

వంగి పాదాలని కళ్ళకి అద్దుకుంటుంటే బాబావారు అతని వీపుపై తలపెట్టారు. ఆలింగనం ఇవ్వలేదు.

ఎందుకనో, ఏమో?

ఆ మహర్భాగ్యాన్ని ఆ రాత్రి ప్రసాదించారు.

ప్రేమాశ్రమం చూద్దువు గాని, రా అని వెంటపెట్టుకు వెళ్ళారు.

పిల్లలు ధ్యానం చేస్తున్నారా సమయంలో.

ఆ దృశ్యం చూస్తుంటే లీక్ ఋషి గారికి ముచ్చటేసింది.

ఈ చిన్న పిల్లలు ఎంత అదృష్టవంతులో, ఇప్పటినుంచే ఆధ్యాత్మిక మార్గంలో పడ్డారు. నాలాగా మూడు పదులు దాటే వరకూ ఆగాల్సిన పని వీళ్ళకి లేదు. సాక్షాత్తూ సద్గురువే దగ్గర వుండి వీళ్ళకి ధ్యానం నేర్పుతున్నాడు అని సంబరపడ్డాడు.

మర్నాడు అక్టోబరు 15వ తేదీన బాబావారు లీక్‌ను కూడా మౌనం పాటించమన్నారు.

హాయిగా వుండమన్నారు.

ఏది కావాలన్నా విష్ణుని అడుగు.

మొహమాట పడకు అన్నారు.

నీకే ఇబ్బందీ రాదిక్కడ అన్నారు.

నీ పట్టుదల దీక్ష నచ్చాయని చెప్పారు.

ఆటు పోట్లు లెక్కచేయలేదు నువ్వు. గతి తప్పలేదు. అందుకనే నువ్వు నాకు నచ్చావని బాబా చెప్తుంటే మన రష్యన్ ఋషి గారు ఆనందంతో తేలి పోయారు.

నీ మనస్సుని గతంలో ఎన్నో సంగతులు తొలిచేశాయి.

వాటిని గుర్తుచేసుకోకు అని బాబావారు అతనికి హితవు చేప్పారు.

ఆధ్యాత్మిక మార్గంలో ఒడిదుడుకులు లేకుండా చేస్తానని అభయం పలికారు. రేపటి నుంచి మౌనం వహించమని ఆదేశించారు.

సహనంగా వుండమన్నారు. లీక్ గారు తలవూపాడు.

అలాగే బాబా, మీరు చెప్పినట్లే చేస్తానన్నాడు.

బోల్డంత సహనం నా సొత్తు.

మీ వరం దొరికే వరకూ సహనంగా ఎదురు చూస్తాను అని చెప్పాడు.

నాకు ఏది ఇవ్వాలో, ఎప్పుడు ఇవ్వాలో మీకే తెలుసు.

సరైన సమయం కావాలి. దైనికైనా అప్పటి వరకు వేచివుంటాను.





అయినా మీ వరప్రసాదానికి నేను అర్హుడిని కూడా కావాలి కదా అని ఈ విదేశీయుడు అంటుంటే ఔరా! అనిపించింది మండలి వారికి.

బాబా వారొక మాట చెప్పారతనికి.

రమ్మని పిలిస్తే తప్ప తమ దగ్గరకి రావద్దన్నారు.

ఎప్పుడు పిలుస్తానో ఇదమిద్దంగా చెప్పలేనన్నారు.

ఆ ఘడియ కొరకు వేచి వుండమన్నారు.

ఆ ఘడియ ఎంత ఆలస్యమైనా దిగులు పడవద్దన్నారు.

పిలవకపోతే రావద్దు.

అంతే నేను ఎప్పుడూ నీతోనే వుంటాను.

నీ మనస్సులో నా మాట వినిపిస్తుంది అని బాబావారు లీక్ ఋషి గారికి విశదం చేశారు.

అలాగే బాబా!

మీ ఇచ్ఛకి దాసుడిని అని లీక్ గారు అన్నాడు.

సద్గురువులు ప్రత్యక్షంగా మాట్లాడక పోయినా వాళ్ళ పిలుపు మాట గుండెలోతుల్లో వినిపిస్తాయి.

నాకు తెలుసీ సంగతి అన్నాడు.

ఇదే కదా ఆంతరంగిక మార్గం అంటే అనుకొన్నాడు.

అలా, ఆ ప్రకారంగా, లీక్ ఋషి యుగావతారునికి అంకితమయ్యాడు.

ఆంతరంగిక ప్రయాణం గురించి బాబావారు అక్టోబరు 16న వివరించారు.

గుండెలోతుల్లో బాబా వారి మాట వినిపించడం, బాబా పలకరించడమే కాదు. బాబావారి మాట ప్రకారం నడుచుకోవడం కూడా అవసరమని పేర్కొన్నాడు.

ఎప్పటిలాగా, పిల్లలకి అర్థమయ్యేలా చెప్పాడు.

బాబావారి మాటలు వింటుంటే వూష్, ఇంతేనా, ఇంత తేలికా ఆధ్యాత్మిక యాత్ర అనిపించింది వింటున్న పెద్దవాళ్ళకి.

ఇంతకీ బాబావారు ఏమి చెప్పారు. ఎలా చెప్పారు. తెలుసుకోవాలని వుందా పాఠకమహాశయా అయితే శ్రద్ధగా వినండి.

కళ్ళకి గంతలు కట్టి మంజిల్ వరకూ వెళ్ళమంటే వెళ్ళగలరా? అని అడిగారు.

అలా నడిరోడ్డు మీద నడుస్తూ వెళ్ళాలి.

ఆ రోడ్డు గతుకులమయం.

కొన్ని చోట్ల బాగా ఇరుకు కూడా.

ఏం చేస్తారు మీరు అని ప్రశ్నించారు.

నేను తోడు వున్నాననుకోండి,

నా చేయి పట్టుకోమన్నాననుకోండి, అప్పుడు ఎలా ఉంటుంది.
ఊపిరి పీల్చుకోరూ! హమ్మయ్య గండం గట్టెకింది అనిపించదు.
నా కళ్ళకి గంతలు లేవు కదా.
నాకు అన్నీ కనిపిస్తున్నాయి.
ఇదిగో ఇలా ఇక్కడ అడుగులేయండి.
జాగ్రత్త, పడిపోతారు. గుంటలున్నాయి.
ప్రక్కకి రండి అని నేను చెప్తుంటే మీ పని ఏమవుతుంది.
గతుకుల నేలపై కూడా ముందు వెనుకా చూడకుండా ధైర్యంగా ముందుకు కదుల్తారు.
అవునా! మరి, నా చేయి పట్టుకోండి అని చెప్పాక కూడా, మీరు నా చేయి గట్టిగా పట్టుకోకపోతే నేనేమి చేయగలను చెప్పండి.
నేను చెప్పింది మీక బుర్ర కెక్కదు.
బాబా చెప్తున్నాడు కదా అనుకొంటా గుడ్డిగా అడుగులు వేస్తారు.
ఏ గుంటలోనో పడ్తారు. లేదా గతుకుల్లో పడితే కాలు బెణుకుతుంది.
కాబట్టి నా చేయి పట్టుకోండి అంటే అర్థం ఏమిటి?
నేను చెప్పినట్లు చేయడం.
ఇదేగా మీకు రోజూ నేను చెప్తుంట.
నా మాట వినండి.
నా గురించే ఆలోచించండి.
మీక అంతా మంచి జరుగుతుంది.
ఇది మీకే తెలుస్తుంది చూస్తూ వుండండి అని బాబావారు తెలియజేశారు.
కళ్ళకి కనబడదు ఆధ్యాత్మిక మార్గం.
ఇది చాలా కష్టమైనది.
ఐతేనేం నేనున్నాను కదా.
నా ఆంతరంగిక విశ్వ కార్యక్రమాన్ని మీ ద్వారా నేను నిర్వహిస్తున్నాను కదా.
అందువల్ల మీకు భగవన్మార్గం హాయిగా, సాఫీగా వుంటుంది.
మీ ప్రయాణంలో ఏ ఒడిదుడుకులు వుండవు అని అభయం పలికారు.

❀ ❀ ❀

కాకాబారియా టోకా వచ్చాడు.
ఆశ్రమం చుట్టూ కంచె వేయమని బాబావారు చెప్పారు.
వెంటనే ఆ పనికి పూనుకొన్నాడతను.
బాబావారి కొలువులో చేరి తరించాలన్నది బారియా కోర్కె.





కానీ ఆ అదృష్టం అతన్ని వరించాలంటే అందుకు అర్హుడు కావాలి కదా.
ఈవేళ చెప్పిన పని అతని భక్తి శ్రద్ధలు పరీక్షించడానికేట.
మరి పరీక్షలో అతడు ఉతీర్ణుడయ్యాడా లేదా!
ఈ సంగతి అప్పుడే చెప్తారా బాబా!
అందుకోసమూ తగిన సమయం కావాలి కదా.
బహుశా అందుకనే నాలుగురోజులు వున్నాడో లేదో,
ఇంకా ఇక్కడ ఎందుకున్నావ్,
బొంబాయి వాపసు వెళ్ళిపో అని బాబావారు తొందరపెట్టారు.
అంతే అతను బస్సు ఎక్కాడు తిరుగు ప్రయాణానికి.
ప్రేమాశ్రమం పిల్లల యోగ క్షేమాలని ఎవరు చూస్తున్నారో గుర్తుందా మీకు.
గుర్తున్నా లేకపోయినా మరోసారి గుర్తుచేసుకుందాము.
ఈ బాధ్యతని బైదుల్, ఛగన్, జాల్‌లపై బాబావారు పెట్టారు.
వాళ్ళు యధా శక్తి విధినిర్వహణ చేస్తున్నారు.
పిల్లలకి ఏమి పెడుతున్నారని బాబావారు అక్టోబరు 18వ తేదీ మధ్యాహ్నం ప్రశ్నించారు.
వీళ్ళు ధ్యానం చేస్తున్నారు కదా రోజూ.
కడుపు నిండా తినకపోయినా, తిన్నా కష్టమే.
పీకల వరకూ తిని, బ్రేవ్ మని త్రేన్చాక ధ్యానానికి కూర్చొంటే మనస్సు దేవుడి పైకి మళ్ళదు. నిద్రకేసి జారుకుంటుంది. అందుకనే పిల్లలు ఏమి తింటే మంచిదో బాబావారు మెహెరాశ్రమ పెద్దల త్రయానికి చెప్పారు. రోజూ ఉదయం అల్పాహారానికి చపాతీలు పెట్టి టీ ఇవ్వండన్నారు. మధ్యాహ్నం పప్పు అన్నం పెట్టమన్నారు. రాత్రి భోజనానికి చపాతీలు చాలు అన్నారు. టీ ఇమ్మన్నారు. వేడి వేడి టీకి నిద్ర దూరమౌతుందని కామోసు ఈ సూచన చేశారు.
మరి చపాతీలు, అన్నంతో పాటు కూరలు వద్దా అని త్రయం అడిగారు.
వద్దన్నారు బాబా.
కూరలు ఎందువల్ల వద్దు అంటున్నారని వాళ్ళు అడగలేదు.
ఇదిగో ఈ కారణం వల్ల అని బాబావారు చెప్పలేదు.
విధేయతకి ఇదొక మరో ఉదాహరణ.
మెహెరాశ్రమానికి కొత్త టైం టేబుల్‌ని బాబా ప్రకటించారు.
ఈ నియమావళి ప్రకారం తెల్లవారు ఝామున రెండు గంటలకే నిద్రలేవాలి.
వెంటనే మొహం కడుక్కోవాలి.
కాలకృత్యాలు తీర్చుకోవచ్చు. వేడి వేడి టీ ఇస్తారు. అది స్ట్రాంగ్‌గా వుండదు.
అయినా సరే హాయిగా టీ త్రాగాలి.

ఈ పనికి గంట కేటాయించాలి.
అంటే మూడింటికల్లా ధ్యానానికి కూర్చోవాలి.
మూడు గంటలు ధ్యానం చేయాలి.
ఆరింటికి అల్పాహారం.
పెట్టింది వెంటనే తినాలి.
అరగంటలో బయటపడాలి.
ఓ అరగంట విశ్రాంతి తీసుకొని, మళ్ళీ ధ్యానానికి కూర్చోవాలి.
ఎనిమిది కొట్టేసరికి, ధ్యానం ఆపి, బాబా సన్నిధికి హాజరుకావాలి.
బాబావారు ఎనిమిది నుంచి తొమ్మిది వరకు హితవాక్యం చెప్తారు.
అక్కడి నుంచి వస్తూనే మంచం ఎక్కి నిద్రపోవాలి.
తొమ్మిది నుంచి పదిన్నర వరకు నిద్ర.
పదిన్నర నుంచి గంటన్నర సేపు స్నానాదికాలకి కేటాయించారు.
ఒకవేళ స్నానానికి ఏర్పాటు లేకపోతే,
బాబావారు చెప్పిన పని చేయాలి.
పిల్లలు నదిలోకి దిగి కేరింతలు కొడుతూ స్నానం చేసేవారు.
ఈత రాదు.
ఈత రాకుండా నీళ్ళలోకి దిగితే ప్రమాదం కదా.
అందుకు పిల్లలకి ఈత నేర్పే పని అబ్దుల్లాపై పడింది.
ఈ బాధ్యతని స్వయంగా బాబావారే అప్పగించారా కుర్రాడికి.
వాడిప్పుడిప్పుడే మన ప్రపంచంలోకి వస్తున్నాడు.
బలం పుంజుకొంటున్నాడు.
ఇది గమనించారో లేదో కాని
బాబావారు అక్టోబరు 19న భోజనం చేయ మన్నారు.
కేవలం ద్రవ పదార్ధాలే తీసుకోమన్నారు.
అబ్దుల్లా సరేనన్నాడు.
కొత్త దీక్ష పట్టాడు. అయిదు రోజుల ఉపవాసం చేశాడు.
ఇంకా మరికొన్ని రోజులు ఉపవాసం వుండేవాడేమో
కాని బాబావారు ఇహ చాల్లే, ఉపవాస దీక్ష విరమించు అన్నారు.
ఆ సాయంత్రం ఆరున్నరకి పిల్లలు బాబా చుట్టూ చేరారు.
ఎప్పటిలా ఓ కొత్త సంగతిని ప్రభువు చెప్తున్నాడు.
కొంతమంది బాబా మాటల్ని పట్టించుకోలేదు సరికదా కేరింతలు కొడుతున్నారు.
వాళ్ళ ధోరణి బాబావారికి చిరాకు తెప్పించింది.





జేమ్స్ ట్రైటస్ ఇంకా నవ్వుతూనే కనిపించాడు.
ఏమయింది నీకు ఈవేళ అని బాబావారు నిలదీశారు.
నాకేమీ కాలేదు బాబా భీవా చేష్టలు నవ్వు తెప్పిస్తున్నాయన్నాడు వాడు.
ఛబు, బానాజీ కూడా పక పకా నవ్వుతున్నారు.
బాబావారికి చిరాకుగా వున్న సంగతే పట్టలేదు వాళ్ళకి.
అందుకనే నాలుగు అక్షింతలు పడ్డాయి ఈ ఇద్దరిపైనా.
వాళ్ళ పేరు చెప్పి మిగిలిన వాళ్ళకీ చివాట్లు పడ్డాయి.
కాలు ముడుచుకొనేటప్పుడు భోజనం చేస్తారా మీరు అని గదమాయించారు.
అంతే అందరూ స్థబ్దులయ్యారు.
మీరు హాయిగా సరదాగా నవ్వుకోండి. తప్పులేదు.
అది ఆటలాడేటప్పుడో మరెప్పుడో అయితే ఫరవాలేదు.
నాకు అభ్యంతరం లేదు.
ఐతే నేను మీ మంచి కోసం నాలుగు మాటలు చెప్తుంటే అది నవ్వుల సమయం కాదు.
శ్రద్ధగా వినాల్సిన సమయం అది అన్నారు.
మరో సంగతి గుర్తు చేశారు.
పిల్లల కోసం ఇతర పనులన్నింటినీ ప్రక్కన పెట్టారట.
మండలివారిని సహయితం పట్టించుకోవటంలేదట.
మరి అటువంటప్పుడు,
పిల్లల దృష్టి బాబా హిత వాక్యంపై వుండాలి తప్ప, ఇంకెక్కడా కాదు. ఇదే మాటని బాబావారు పిల్లలకి చెప్పారు.
తప్పు తెలిసిన మంచి బాలుడిలా అందరూ బుద్ధిగా సర్దుకు కూర్చొన్నారు.
అప్పటి వరకు బాబావారి మొహంలో కనిపించిన చిరాకు మాయమైంది.
ప్రసన్న వదనులయ్యారు.
పిల్లలు హమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నారు.
సరదా సరదా దసరా పండుగ అక్టోబరు 23న వచ్చింది.
వస్తూ మంచి కబురు తెచ్చింది.
ఏమిటి ఆ కబురు అంటారా పాఠక మహాశయా అయితే వినండి.
ఈవేళ బాబావారు తమ 12 రోజుల ఏకాంతవాసాన్ని ముగించారు.
42 రోజులుగా చేస్తున్న ఉపవాస దీక్ష విరమించారు.
ఉపవాస, ఏకాంత దీక్షలతో బాబావారు బాగా నీరసపడ్డారు.
మూత్రంలో రక్తం కూడా పోతోంది.

రమ్జూ కంగారు పడ్డాడు. డాక్టరుని పిలిపిస్తానన్నాడు.

భయపడకు అని ధైర్యం చెప్పారు బాబా.

తమ ఉపవాస మహిమని వివరించారు.

నేను ఉపవాసం వుంటే, యావత్తు మానవాళి ఉపవాసం పాటించినట్లేనన్నారు.

అందరిలో వున్నది నేనే కదా అంటూ సృష్టి గీత రహస్యాన్ని మరోసారి చెప్పారు.

ఆ వేళ (అక్టోబరు 23వ తేదీన)

బాబావారు 15 మందిని ప్రేమాశ్రమం నుంచి మెహెరాశ్రమానికి పంపేశారు.

ఇహ 18 మంది మిగిలారు ప్రేమాశ్రమంలో.

వీరు ఆఘూ ఆలీ, ఆలీ అక్బర్, బబన్, ఛబు, దత్తు, దౌలక్, అస్పందియర్, హోర్మొసజి, జేమ్స్, జవాన్‌మర్ద్, ఖురా బక్ష్, నానా, మారుతి, సాహు, సూర్యభాన్, తుకారామ్, వసంత్.

వీరి ఆనందానికి పట్టపగ్గాలు లేవు.

ఐతే, మెహెరాశ్రమానికి పంపబడ్డ వారికి మాత్రం దు:ఖం కట్టలు తెంచుకొంది. నేనేం పాపం చేశాను బాబా.

నాపై ఇంత నిర్దయా నీకు అని పండిట్ భోరుమన్నాడు.

నాకింకో అవకాశం ఇయ్యి బాబా అని వేడుకొన్నాడు.

వీడి వయస్సు ఎనిమిదేళ్ళు.

నేను చిన్న పిల్లాడిని. నాపై నీకు ఇంత కాఠిన్యం దేనికి అని మొరపెట్టాడు.

దేవ దేవుడివి నువ్వు. పిల్లవాడిని నేను. నాపై దయ చూపించు. ఇంకో అవకాశం నాకియ్యి అని ప్రాధేయపడ్డాడు.

అలనాటి ప్రహ్లాదుడి వేదన విని కదిలిన నరసింహునిలాగ,

ఇలనాటి ప్రేమాశ్రమ చిన్నారి ఆర్తనాదానికి అపర నరసింహుడు చలించాడు.

ప్రేమాశ్రమంలో పండిట్‌ని వుండనీయమన్నాడు.

లోభాజీ, ఛివా, చందర్, బానాజీ కరానీ లు కూడా మెహెరాశ్రమానికి వెళ్ళమని పట్టుపట్టారు.

మేమేమి తప్పుచేశాము. మా కెందుకీ శిక్ష అన్నారు. మేము నిజంగా తప్పుచేస్తే, ఇక్కడి నుంచే వెళ్ళిపోతామని బెదిరించారు.

ఆ నలుగుర్నీ బాబావారు లాలించారు.

ఎక్కడికి పోతారు.

నేను చెప్పినట్లు చేయండి.

మీకే ఇబ్బందీ రాదని నచ్చచెప్పారు.

మెహెరాశ్రమంలోకి వెళ్ళటానికి ఒప్పించారు.





ఇది చూసిన ఛగన్ దేవ్, గెనూలకి భయం పట్టుకుంది.

మా గోడు కూడా బాబావారు వినరనిపించింది.

అంతే మండలివారిని ఆశ్రయించారు.

మా తరఫున మీరైనా చెప్పండి అన్నారు.

మమ్మల్ని క్షమించమని బాబావారికి చెప్పమన్నారు.

ఎక్కడైనా రాయబారం చెల్లుతుందేమో కానీ, సాక్షాత్తు దేవ దేముడి దగ్గర మాత్రం కాదు.

సాయంత్రం నాలుగు అవుతుంటే వీరిద్దర్నీ బాబావారే స్వయంగా పిలిచారు.

అంటే దివ్యవతారుడు ఛగన్ దేవ్, గెనూలకి మరో అవకాశం కల్పించాడన్న మాట. ఇద్దరి తరఫున ఛగన్ క్షమాభిక్షనర్థించాడు.

మనస్ఫూర్తిగా చేస్తున్నా నేను బాబా.

మా తప్పులు క్షమించు. జీవితాంతం, ఊపిరి వున్నంత వరకు నీ పాదసేవకే అంకితమవుతాము.

మా మాట నమ్ము బాబా అంటూ ఏడుపు ఆపుకోలేకపోయారు.

భోరు మంటూనే మనస్సులో మాట మళ్ళీ మళ్ళీ చెప్పారు.

పరంధాముడి మనస్సు కరిగింది.

వాళ్ళిదర్నీ క్షమించారు. ప్రేమాశ్రమంలోనే వుండండి అన్నారు.

ఆ చిన్నారుల ఆనందాన్ని మాటల్లో చెప్పలేము.

అప్పటి వరకు కళ్ళ నీళ్ళతో దేవ దేవుని పాదాలకభిషేకం చేస్తున్నవారు కాస్తా సంతోషంతో గెంతులు వేశారు.

మళ్ళా నీకు ఎప్పుడు కోపం తెప్పించమన్నారు.

నీమాట జవదాటమన్నారు.

నీ సేవలోనే చరితార్థులమవుతామన్నారు.

ఇలా ఆవేళ ముందుగా 15 మంది అనుకొన్నా 12 మంది మాత్రమే ప్రేమాశ్రమం నుంచి కదిలారు.

మెహెరాశ్రమంలో అడుగుపెట్టారు.

ఒక్కటే ఏడుపు. ఏడ్చి ఏడ్చి పిచ్చివాళ్ళలా అయ్యారు.

హరి అయితే, ఎడబాటు తట్టుకోలేనంటూ రుమాలుతో గొంతుక బిగించుకోబోయాడు. షాపూర్, బస్సీ, జంషెడ్ గుస్తాద్, జంషెడ్ నామ్‌దార్‌లు చేసిన గొడవ ఇంతా అంతా కాదు. మాకెందుకీ శిక్ష అని గుండెలు బద్దలుకొట్టుకున్నారు. ఇలా అయితే లాభం లేదని, ఆ నలుగురినీ విడిగా వుంచమని బాబావారు ఆదేశించారు. టోకా ఆశ్రమంలోనే 'మెహెరాబాద్' అన్న విభాగం ఒకటి వుంది. అక్కడికి తీసుకువెళ్ళండి అని బాబావారు

చెప్పారు.

రఘునాథ్‌కి మరో రకం శిక్ష వేశారు.

'తెల్లవారు ఝూమున నాల్గింటికే నిద్రలే. ధ్యానం చేయి రోజూ' అని బాబావారు అతనికి చెప్పారు.

'మహా ప్రసాదం' అన్నాడా చిన్నారి.

పిల్లలు అందరికీ అంటే, మెహెరాశ్రమానికి పంపబడుతున్న 12 మందికి, బాబావారు బాధపడవద్దని మరోసారి చెప్పారు.

నేనే పని చేసినా మీ మంచికే కదా అన్నారు.

తను వాడే వస్తువులని వాళ్ళకి తీపి గుర్తుగా ఇచ్చారు.

తమ ఫోటోలు, రుమాలు, వాడిన సీసాలు, గ్లాసులు, గిన్నెలు ఇచ్చి, ఈ కానుక దాచుకోండి అని చెప్పారు.

మహదానంద పడ్డారు.

పిల్లలు అంత ఏడుపులోనూ మహా ప్రసాదమని కళ్ళకి అద్దుకొన్నారు.

బాబావారి కానుకని జీవితాంతం పదిలంగా దాచుకొన్నారు.

ఈ సంఘటన సమయానికి అజోబా, అర్దషేర్ ఇరానీ ఇళ్ళకి వెళ్ళిపోయారు. వీళ్ళలాగే చాలామంది మగవాళ్ళు ఇంటిదారి పట్టారు. ముమ్ముందు రాబోయే సంఘటనలకి వీరి ప్రస్తానం సంకేతమనిపించింది.

అక్టోబరు 24వ తేదీన బాబావారు ప్రేమాశ్రమం పిల్లల్ని కొందర్ని హాపీవాలీకి పంపారు. వాళ్ళ వెంట ఛగన్, బైదుల్, కరీమ్ కదిలారు. సాయంకాలం ఐదింటికి వీరంతా బయలుదేరారు. మర్నాడు తెల్లవారు ఝూమున మూడున్నరకి బాబావారు అక్కడికి చేరారు. నిన్ను విడిచి వుండలేమయా అని పిల్లలు అంటే, మిమ్ము వీడి వుండలేనురా అని ఘరందాముడు అంటున్నాడనిపించింది మండలివారికి.

బాబావెంట, అబ్దుల్లా, జాల్, పెన్రూ రాజారామ్, ఆలీ అక్బర్, ఆఘా ఆలీ, కళింగద్, బబన్, జవాన్ మర్ద్ హాపీ వ్యాలీకి వచ్చారు. ఐదున్నరకి బాబావారే స్వయంగా టీ చేసి, అందరికీ ఇచ్చారు.

పిల్లలు తలోచేయి వేస్తుంటే, బజ్జీలు వేసి, వేడి వేడికి పెట్టారందరికీ.

ఇంతలో సరోష్ వచ్చాడు. చపాతీలు తెచ్చాడు.

ఘుమ ఘుమ లాడే కూర కూడా తీసుకువచ్చాడు.

పిల్లలు పెద్దలు అందరూ చపాతీల అల్పాహారం కానిచ్చారు.

మధ్యాహ్నం రుస్తుం తమ్ముడు ఆదీ వచ్చాడు.

బాబావారిని కారులో షికారుకి తీసుకువెళ్ళాడు.

అరగంటసేపు జరిగింది కారులో షికారు.





రాత్రి భోజనాలయ్యాక పిల్లలకి బాబావారొక మాటచెప్పారు.

నేను చెప్పిన ప్రకారం చేయండి.

నా మాట ప్రకారం నడవండి.

శక్తివంచన లేకుండా ప్రయత్నించండి చాలు.

ఆధ్యాత్మిక మార్గంలో ముందుకు నడిపిస్తాను మిమ్మల్ని అని చెప్పారు.

తప్పుచేస్తే క్రుంగిపోవద్దు.

అయ్యో, ఇప్పుడు ఎలాగ అని వణికిపోవద్దు.

తప్పులని పట్టించుకోను. ఒకసారి కాదు. రెండుసార్లు కాదు. పది లక్షల సార్లయినా సరే మిమ్మల్ని నేను క్షమిస్తాను. కాబట్టి మీరు నా దగ్గర భయపడకండి. ధైర్యంగా వుండండి. నాకు విధేయులై వుండండి అని విధేయత పాఠాన్ని మరోకసారి చెప్పారు బాబావారు.

ఈ మధ్య తరచుగా బాబావారు విధేయత గురించి మాట్లాడుతున్నారు.

తమ మాట జవదాటకూడదని పదే పదే హెచ్చరిస్తున్నారు.

కారణంలేకుండా బాబావారేపనీ చేయరు.

అనవసరంగా ఏమాటా బాబా అనరు.

కాబట్టి పాఠకమహాశయా,

ఇప్పుడు, ఇక్కడ హాపీ వ్యాలీ విహార సమయంలో బాబావారు విధేయత ప్రస్తావన ఎందుకు చెప్తున్నారంటారు?

బహుశా, పిల్లలకి ఆధ్యాత్మికోన్నతి సమయం దగ్గరపడి వుండాలి.

అందుకనే ఈ హెచ్చరిక కావచ్చు.

ఆనాడు బాబావారు చెప్పిన మరికొన్ని సంగతులు ఇచ్చిన సంకేతం ఇదే.

అమ్మ మనస్సు వెన్న.

పిల్లల్ని లాలిస్తుంది, అలరిస్తుంది.

అవసరమొస్తే కోపడుతుంది.

కేకలేస్తుంది.

రెండు దెబ్బలు వేసి అయినా పిల్లాడిని దారిలోకి తెస్తుంది.

అలానే బాబావారు కూడా.

ఈ మాటని స్వయంగా బాబావారే చెప్పారు పిల్లలకి.

అమ్మని చూస్తే ఎవరైనా భయపడతారా? భయపడరు కదా.

అలానే తమని చూసినా పిల్లలు భయపడకూడదన్నారు.

'నేను అమ్మని.

అసలు మీకే కాదు ఈ యావత్తు సృష్టికీ నేనే తల్లిని.

మీరంటే నాకు మరీ ఇష్టం' అని చెప్పారు.
మిమ్మల్ని మెహెరాశ్రమానికి పంపనని స్పష్టంచేశారు.
కొంతమందిని మెహెరాశ్రమానికి పంపేశాను.
అయితే మీకా ప్రమాదం లేదు.
మిమ్మల్ని మెహెరాశ్రమానికి పంపను భయపడకండి అని వాళ్ళ మనస్సులో భయం పోగొట్టారు.
'ఒకవేళ అదిలించినా అదిరి పోకూడదు.
నేను మీ అమ్మని కదా.
మీ మేలే కదా నేను కోరుకొనేది' అన్న గట్టి నమ్మకం కల్గించడానికి బాబావారొక ఉదాహరణ చెప్పారు.
పిల్లలతో మాట్లాడేటప్పుడు ఇటువంటి ఉదాహరణలెన్నింటినో ఇస్తుంటారు బాబా.
పరమాత్మ సాన్నిధ్యంలోనే తరించాలన్న తపన వున్న ప్రేమాశ్రమపు గోపికలు చిన్న పిల్లలు.
ఏది చెప్పినా వాళ్ళ మనస్సుకి హత్తుకొనేలా చెప్పాలి కదా.
ఇంతకీ ఆవాళ్ళ ఉదాహరణ ఏమిటీ?
అదొక అల్లరి పిల్లాడి ఆకతాయి కథ.
ఆడుతూ ఆడుతూ ఓ కుర్రాడు నోట్లో రాయి కుక్కుకొన్నాడు.
తల్లి చూసింది.
గాభరాపడింది.
చూస్తూ ఊరుకొంటుందా!
అమ్మ కదా.
వాడొక వేళ రాయిని మ్రింగేస్తే?
ఇంకేమైనా వుందా అందుకనే పిల్లాడిని ప్రేమగా దగ్గరకి తీసుకొంది.
లాలించింది.
నయానా భయానా చెప్పింది.
రాయిని ఉమ్మేయరా నాయనా అంది.
అబ్బే!
వాడు వింటే కదా!
విసుక్కొంది.
కొడ్తారా భడవా అంది.
అయినా వాడు నోరు తెరవ లేదు.
వెంటనే పిర్ర మీద రెండు వేసింది.





అంతే వాడు బేరుమన్నాడు.
రాయికాస్తా క్రిందపడింది.
ఇదీ కథ.
ఈ కథలో లాగానే,
తాము కూడా పిల్లల మంచిని కోరే అమ్మనేనని బాబావారు చెప్పారు.
నేను మీకే కాదు ఈ యావత్తు ప్రపంచంలోని అందరికీ అమ్మని.
అయితే మీరంటే నాకు బాగా ఇష్టమన్నారు.
'మరి మీకు నేను అమ్మని.
మీరంటే నాకు ఇష్టం కాబట్టి మీరు నా దగ్గర భయపడతారా!
భయపడాల్సిన అవసరముందా అని ప్రశ్నించారు.
భయపడకండి ఎప్పుడూ అని స్పష్టం చేశారు.
చెప్పిన ప్రకారం చేయండి.
మిమ్మల్ని ముందుకు నడిపిస్తానన్నారు.
బాబావారి ఉవాచతో పిల్లల్లో కొత్త ఉత్సాహం వచ్చింది.
మళ్ళీ మనల్ని కూడా మెహెరాశ్రమానికి పంపేస్తారేమోనన్న భయం దూరమైంది.
బాబావారు చాక్లెట్లు ఇచ్చారు.
అది చూస్తేనే నోరూరింది పిల్లలకి.
చాక్లెట్లు తిని ఎన్నిరోజులయిందోమరి.
అయినా ఇంతటి ఆనంద సమయంలో నోటిలో తీపి పడటం అదీ దేవదేవుని హస్తాల మీదుగా దొరకటం అంతా పూర్వజన్మ సుకృతం మన గోపికలకి.
అందరికీ దొరుకుతుందా అటువంటి అదృష్టం.
ఇంతకీ హ్యాపీ వ్యాలీకి చాక్లెట్లు ఎవరు తెచ్చారు?
ఆదీ పట్టుకు వచ్చాడు.
ఇది మీకు సరదా సమయం అన్నారు బాబా.
ఇక్కడ వున్న నాలుగు రోజులూ ధ్యానం చేయనక్కర్లేదన్నారు.
ఇది ఇంకో ఆటవిడుపు పిల్లలకి.
నేను మీతో వుంటాను సరదాగా. ఈ లోయలో రోజూ తిరుగుదామన్నారు. అన్నట్లు మూడు రోజులు బాబావారు పిల్లలు లోయలో చాలా చోట్లకి వెళ్ళారు.
ఆటలు ఆడారు. కాలక్షేపానికి గ్రామఫోను పాటలు పెడితే ఆ పాటల అర్థాన్ని బాబావారు వివరించేవారు. అలా ఐదురోజులు ఐదు క్షణాల్లా గడిచాయి హ్యాపీ వ్యాలీలో. అక్టోబరు 28వ తేదీ సాయంత్రం అందరూ టోకా తిరిగివచ్చారు.

## 23వ పావగడ వార్షికోత్సవం

శ్రీరామ నవమి సందర్భంగా 2012 ఏప్రిల్ ఒకటో తేదీన కర్నాటక రాష్ట్రంలో గల పావగడ బాబా సెంటర్ 23వ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నట్లు బాబా ప్రేమికులు శ్రీ నాగభూషణం ఒక ప్రకటనలో తెలిపారు.

## నరసన్నపేట బాబా సెంటర్ వార్షికోత్సవం

శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట బాబా సెంటర్ 4వ వార్షికోత్సవం 29.04.2012 ఉదయం 7 నుండి మధ్యాహ్నం 2 వరకు నిర్వహించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

## కామారెడ్డి బాబా సెంటర్ వార్షికోత్సవం

కామారెడ్డి సెంటర్ 19వ వార్షికోత్సవాన్ని 2012 మే 1న ఉదయం 7 నుండి మధ్యాహ్నం 2 వరకు జరిపిన్నట్లు శ్రీ యం. అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

## శ్రీమతి దుర్గాకుమారి బాబాలో ఐక్యం



శ్రీమతి దుర్గాకుమారి, హైదరాబాద్ గురువారం, మే 10వ తేదీ తెల్లవారుఝామున 5 గంటలకు బాబాలో లీనమయ్యారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్స్‌పాల్‌గా చేసి పదవీ విరమణ చేసిన దుర్గాకుమారి బాబా సాహిత్యాన్ని ముఖ్యంగా మెహెర్‌బాబా ప్రవచనాలు, భగవద్వచనం గ్రంధాలును క్షుణ్ణంగా అధ్యయనం చేశారు.

ఆమె గొప్ప వక్తగా, బాబా సందేశాలను తు.చ తప్పక ఆచరించే బాబా ప్రేమికురాలుగా స్థానికులందరికీ ఆమె సుపరిచితురాలు.

## కదిరి

బాబా ప్రేమికులు శ్రీ నామా చక్రపాణి, కదిరి సెంటర్ బాబాలో ఐక్యమయ్యారని స్థానిక ప్రేమికులు తెలిపారు.

## చదవండి..చదివించండి

**మెహెర్‌బాబా పత్రిక చదవండి..చదివించండి.**
**మీ బంధు మిత్రులందరికీ పత్రికను అందజేయండి.**





చిన్ని గ్రామం

# గుడ్లూరులో నూతన బాబా సెంటర్

## మౌన వార్షికోత్సవానికి 100 మంది సన్నిద్ధం

నెల్లూరు జిల్లా, కావలికి సమీపంలోని గుడ్లూరు గ్రామంలో మే 12, శనివారం, పెద్ద ఎత్తున బాబా సహవాస్ నిర్వహించినట్లు స్థానిక బాబా ప్రేమికులు శ్రీ బ్రహ్మారెడ్డి, శ్రీ కోటేశ్వరరావు, తెలిపారు. స్థానికంగా నూతన బాబా సెంటర్‌ను ఆనాడు ప్రారంభించామని శ్రీ రెడ్డి తెలిపారు.

ఈ కార్యక్రమానికి శ్రీ సింహాచలం, శ్రీమతి గిరిజారాణి, అలాగే హైదరాబాద్ నుండి శ్రీ పండుగ రమణ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. శ్రీ సింహాచలం, శ్రీమతి గిరిజా రాణి అవతార్ మెహెర్‌బాబా అవతార తత్వం, బాబా సందేశాలపై ప్రసంగించగా, శ్రీ పండుగ రమణ తన పాటలు, భజన కీర్తనలతో కార్యక్రమాన్ని చక్కగా రక్తి కట్టించారని తెలిపారు.

కావలి పట్టణానికి సమీపంలో గల గుడ్లూరు చిన్ని గ్రామంలో క్రొత్తగా అవతారుని నామ జపంతో గడపటమే కాదు, స్థానిక గ్రామస్థులందరూ మెహెరాబాద్‌లోని మెహెరుని దర్శనం కోసం తహతహలాడుతున్నారని బ్రహ్మారెడ్డి – కోటేశ్వరరావులు తెలిపారు. ఈ గ్రామం నుండి జూలై 10 మౌన వార్షికోత్సవ సందర్భంగా 100 మంది బాబా ప్రేమికులు మెహెరాబాద్‌కు విచ్చేసేందుకు సన్నిద్ధులయ్యారని, ఇందుకోసం రానూపోనూ రైలు రిజర్వేషన్లు కూడా చేయించారని తెలిపారు.

## విజయనగరం–నూతన కార్యవర్గం

**గౌ. అధ్యక్షులు –** శ్రీ సిహెచ్. అఘోరపతి,
**అధ్యక్షులు–** శ్రీమతి సబ్బిసెట్టి అనసూయమ్మ,
**వైస్ ప్రెసిడెంట్:** శ్రీమతి కె. సూర్యకుమారి, శ్రీ పి. రాజేశ్వరరావు,
**సెక్రటరీ:** శ్రీ ఎస్. మెహెర్ శ్రీను,
**జాయింట్ సెక్రటరీ:** శ్రీమతి ఎన్.వి. విజయలక్ష్మి, టి.పి.హెచ్. బాలాజి రావు,
**ట్రెజరర్:** శ్రీమతి పి. కస్తూరి మరియు 14 మంది కార్య నిర్వాహక సభ్యులు ఎన్నికయినట్లు శ్రీ కొల్లి రామారావు ఒక ప్రకటనలో తెలిపారు.

# ప్రభుస్తుతి

## ప్రభుస్తుతి

ఓ పర్‌వర్ధిగార్,
సర్వపోషకా! సర్వ రక్షకా!
నీవు ఆదియును
అంతమును లేని వాడవు,
అద్వయుడవు,
నిరుపమానుడవు,
నీ ప్రమాణమెవ్వరును
ఎరుంగనేరరు
నీవు వర్ణము,
నామము,
రూపము,
గుణములు లేని వాడవు.
నీవు అపరిమితుడవు
గంభీరుడవు,
ఊహాతీతుడవు,
భావనాతీతుడవు,
శాశ్వతుడవు
నాశము లేని వాడవు.
నీవు అవిభాజ్యుడవు,
దివ్యచక్షువులతో గాని
నిన్నెవరును చూడజాలరు
నీవు ఎల్లప్పుడు నుంటివి,
నీవు ఎల్లప్పుడు నున్నావు
నీవు ఎల్లప్పుడు నుందువు
నీవు అంతటను గలవు,
నీవు అన్నింట నున్నావు.

మరి నీవు అంతటికి
అన్నింటికి
ఆవలనుందువు.
నీవు ఆకాశమును గలవు
పాతాళమున గలవు
నీవు వ్యక్తుడవు
అవ్యక్తుడవు,
అన్ని భూమికలందున్నావు,
అన్ని భూమికల కతీతుడవు.
నీవు మూడు
లోకాలలోనున్నావు
ముల్లోకాల కావలగూడ నున్నావు.
నీవు అగోచరుడవు,
స్వతంత్రుడవు.
నీవు సృష్టికర్తవు,
ప్రభువులకు ప్రభుడవు,
అందరి మనస్సులను
హృదయములను
ఎరిగిన వాడవు,
నీవు సర్వశక్తిమంతుడవు,
సర్వవ్యాపివి,
నీవే అనంతజ్ఞానము,
అనంత శక్తియు,
అనంత ఆనందమును.
నీవు జ్ఞానసాగరుడవు,
సర్వజ్ఞుడవు,

అనంత జ్ఞానివి,
త్రికాల వేదివి,
జ్ఞానమే నీవు,
నీవు సర్వదయాళుడవు,
నిత్య శుభంకరుడవు,
నీవు ఆత్మలకెల్ల నాత్మవు
అనంతగుణ విశిష్టుడవు,
నీవు సత్య, జ్ఞాన
ఆనందముల
త్రిమూర్తివి,
నీవే సత్యమునకు
మూలము,
ప్రేమ మహాసాగరుడవు,
నీవు పురాణ పురుషుడవు,
సర్వోత్తముడవు,
నీవు ప్రభుడవు,
పరమేశ్వరుడవు,
నీవు పరుడవు,
పరాత్పరుడవు,
నీవు పరబ్రహ్మవు,
అల్లాహ్,
ఇలాహీ,
యజ్‌దాన్,
అహురమజ్ దా,
ప్రియతముడైన
భగవంతుడవు,
నీవు 'ఈజద్' అనబడు
ఏకైక పూజ్యుడవు.





# పశ్చాత్తాప ప్రార్థన

**ఓం పరబ్రహ్మ - పరమాత్మా**
**యా - యాజ్‌దాన్**
**లా ఇలాహ్ ఇల్లిల్లాహ్**
**ఓ గాడ్ ఫాదర్ ఇన్ హెవెన్**
**ప**రమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము, అధర్మము,
అపవిత్రమును అగు
మా ప్రతి తలంపునకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని, ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకును
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అనృతమునకును,
సమస్త కపటవర్తనమునకును,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకును,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చునట్టి
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసినట్లు
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపములన్నిటిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని, మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలులమగుచున్న
మమ్ములనందరిని క్షమింప
వేడుకొనుచున్నాము.

# మండలి ప్రార్థన

ప్రియ దైవమా!

నిన్ను అధికాధికముగా ప్రేమించునట్లును, ఇంకను అధికముగా నీతో ఐక్యమగునంతటి అర్హతగల వారమగునంతవరకును నిన్నింకను అధికముగ ప్రేమించునటుల మాకందరకు సహాయము చేయుము.

మరియు చిట్టచివరి వరకు బాబా కొంగును దృఢముగా పట్టుకొని ఉండుటకై మాకందరకు సహాయము చేయుము.